Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 04.07.2014, శుక్రవారం
సంపుటి : 34 సంచిక : 05
పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



విజయంతో..

## హు'షార్'



(వివరాలు 12వ పేజీలో)

- కార్పొరేషన్‌ను కైవసం చేసుకున్న వైకాపా
- కావలి, వెంకటగిరి, నాయుడుపేట, గూడూరు, కావలి మున్సిపాల్టీలు 'దేశం' ఖాతాలోకి
- ఆత్మకూరును దక్కించుకున్న కాంగ్రెస్



# నెల్లూరు మేయర్‌గా అజీజ్

***అత్యంత ఉద్రిక్త పరిస్థితులు... క్షణక్షణానికి మారిన నాటకీయ పరిణామాలు, క్యాంపు రాజకీయాలు, ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు, ప్రతివ్యూహాలతో వేడెక్కివున్న నెల్లూరు నగరపాలకసంస్థ మేయర్ పదవి పోరుకు ఈ నెల 3వ తేదీన తెరపడింది. నెల్లూరు నగరపాలక సంస్థకు మూడవ మేయర్‌గా మైనార్టీ వర్గాలకు చెందిన షేక్ అబ్దుల్ అజీజ్ ఎన్నికయ్యారు.***

రాష్ట్ర ఎన్నికల సంఘం అదేశాల మేరకు ఈ నెల 3వ తేదీన నెల్లూరు నగరపాలకసంస్థకు మేయర్, డిప్యూటీమేయర్‌ల ఎన్నిక జరిగింది. అలాగే జిల్లాలోని కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట పురపాలక సంఘాల లోనూ ఛైర్మెన్‌లు, వైస్‌ఛైర్మెన్‌ల ఎన్నిక జరిగింది. 3వ తేదీ నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్లో ఈ ఎన్నికల ప్రక్రియకు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

(మిగతా 10వ పేజీలో)




తండ్రి.. పాలనకు...

## తనయుడు పార్టీకి

**మీ కోసం నేనున్నానంటూ కార్యకర్తలకు లోకేష్ భరోసా**

అధికారంలోకి రాకముందు నాయకులంతా కార్యకర్తలే పార్టీకి ముఖ్యమని.. వారే పార్టీకి ప్రాణమని పొగుడుతూ వుండడం సహజం. తీరా ఆ తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చాక కొంతమంది నాయకులు కార్యకర్తలను నిర్లక్ష్యం చేసి తమ పని తాము చేసుకుపోతుండడం కూడా షరా మామూలే. అయితే, పార్టీకి అన్నివేళలా వెన్నుదన్నుగా వుంటూ, పార్టీకి ప్రాణమిచ్చే కార్యకర్తలే లేకుంటే ఏ పార్టీ అయినా అధికారంలోకి రావడం కల్ల...ఆ నిజం తెలిసిన నేత కనుకే, యువనేత లోకేష్ తమ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ పార్టీని అధికారంలోకి తెచ్చిన కార్యకర్తలను

(మిగతా 10వ పేజీలో)



# రైల్వేబడ్జెట్‌లో నెల్లూరుకు న్యాయం జరిగేనా?



**ప్రతిఏటా రైల్వేబడ్జెట్ రావడం, నెల్లూరుజిల్లాకు మొండిచేయి చూపడం ఒక ఆనవాయితీగా వస్తోంది. రైల్వేపరంగా జిల్లాలో కొన్ని ప్రాజెక్ట్‌లు ఎప్పటి నుండో పెండింగ్‌లో ఉంటున్నాయి. ముఖ్యంగా ఇంతకాలం రైల్వే మంత్రులుగా వచ్చిన వాళ్లు తమ సొంత రాష్ట్రాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ రావడంతో మిగిలిన ప్రాంతాలకు అన్యాయం జరుగుతూ వస్తోంది. నెల్లూరు జిల్లానైతే అసలు పట్టించుకునేవాళ్లు లేరు. జిల్లాలో అనవసరమైన పనులు ఏమీ అడగడం లేదు. అవసరమైనవే అడుగుతున్నారు. వాటిని చేపడితే రైల్వేకు ఆదాయమే.**

నడికుడి – శ్రీకాళహస్తి రైలు మార్గం సర్వేలకే పరిమితమైంది. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఈ మార్గాన్ని నిర్మించాలని బడ్జెట్‌లో పొందుపరచినా అది కార్యరూపం దాల్చలేదు. నాలుగుజిల్లాల్లో 30కిపైగా మండలాల ప్రజలకు ఈ రైల్వే లైన్ ఉపయోగపడుతుంది. విజయవాడ, చెన్నైల మధ్య వున్న రైల్వేలైన్‌కు ఇది ప్రత్యామ్నాయంగా కూడా మారుతుంది. తుఫాన్‌ల సీజన్‌లో చెన్నై మార్గం దెబ్బతినే అవకాశముంది. అప్పుడు రాకపోకలకు కాళహస్తి – నడికుడి మార్గం ఉపయోగపడుతుంది. సరుకు రవాణా కూడా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఇంత ప్రాధాన్యతగల రైల్వేలైన్‌పై ఇప్పటివరకు కేంద్ర రైల్వే మంత్రులుగా పనిచేసిన వాళ్లు సీతకన్ను వేస్తూ వచ్చారు.

దక్షిణమధ్య రైల్వేలో ఇప్పుడు అత్యధిక ఆదాయం అందిస్తున్నది విజయవాడ డివిజనే! దీనికి ప్రధానకారణం కృష్ణపట్నం పోర్టు. ఇక్కడ ఎగుమతులు, దిగుమతులు మొదలయ్యాక విజయవాడ డివిజన్‌కు అనూహ్యంగా ఆదాయం పెరిగింది. వాణిజ్యపరంగా ఇంతటి ప్రాధాన్యంగల కృష్ణపట్నం పోర్టు నుండి కడపజిల్లాలోని ఓబులాపురం వరకు రైల్వేలైన్ నిర్మించాల్సివుంది. ఇంతవరకు వెంకటాచలం వరకే లైన్ వుంది. వెంకటాచలం నుండి ఓబుళాపురం లైన్ పూర్తయితే బెంగుళూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలతో కూడా కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం ఏర్పడుతుంది. వాణిజ్య కార్యకలాపాలు పెరుగుతాయి. ఇక కేంద్రప్రభుత్వం వాకాడు మండలం దుగరాజపట్నం వద్ద అతిపెద్ద నౌకా కేంద్రాన్ని నిర్మించాలనుకుంటోంది. గతంలోనే గూడూరు–దుగరాజపట్నం రైల్వేలైన్‌ను మంజూరు చేసి వున్నారు. కాని దీనిపై ఇప్పటివరకు సర్వే కూడా జరగలేదు.

బిట్రగుంట అయితే బ్రిటీష్ వారి కాలంలోనే రైల్వేపరంగా ఓ వెలుగువెలిగింది. ఇప్పుడు దాని ప్రతిష్ట మసకబారింది. బిట్రగుంటను రైల్వేపరంగా అభివృద్ధి చేయడానికి అన్ని అవకాశాలు వున్నాయి. ఇక నెల్లూరు నుండి చెన్నై, బెంగుళూరుల మధ్య యూనిట్ రైళ్లను, ఫాస్ట్ ప్యాసింజర్‌లను పెంచాలి. నెల్లూరు అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందుతున్న నగరం. కొన్ని సూపర్‌ఫాస్ట్‌రైళ్లకు ఇక్కడ స్టాపింగ్ లేదు. వాటికి కూడా స్టాపింగ్ ఇవ్వాలి. రాబోయే బడ్జెట్‌లోనైనా జిల్లాకు సంబంధించిన పనులు కొన్నయినా నెరవేరేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

## రాజకీయ రచ్చకు కేంద్రంగా...

# నకిలీ మద్యం చిచ్చు



**జిల్లాలో నకిలీ మద్యం కేసు రాజకీయ చర్చలకు కేంద్రంగా మారుతోంది. తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్ నాయకుల మధ్య పంతాలు, పట్టింపులకు, ఆధిపత్య ధోరణులకు ఇది దారితీస్తోంది.**

జిల్లాలోని నకిలీ మద్యం కేసును సిబిఐకి అప్పగించాలని రాష్ట్ర మంత్రివర్గమే నిర్ణయించడంతో ఇది ఎక్కడిదాకా పోతుందో అంతుబట్టడం లేదు. జిల్లాలోని వైకాపా ఎమ్మెల్యేలను లక్ష్యంగా చేసుకునే తెలుగుదేశం ప్రభుత్వం సిబిఐ అస్త్రాన్ని సంధించినట్లుగా అర్ధమవుతుంది. రాష్ట్ర స్థాయి పోలీసు అధికారులతో దర్యాప్తు జరిపిస్తే అది రాజకీయ వేధింపులలోకి వెళుతుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం దీని విచారణ బాధ్యతను సిబిఐకి అప్పగించాలని నిర్ణయించింది. సిబిఐ విచారణలో వైసిపి ఎమ్మెల్యేలను దోషులుగా తేలిస్తే తమ చేతికి మట్టి అంటకుండా పోతుందని, ప్రజల ముందు వైకాపాని దోషిగా నిలబెట్టొచ్చని తెలుగుదేశం ప్లాన్.

ఇటీవల జరిగిన స్థానిక మరియు సార్వత్రిక ఎన్నికలలో ఈ నకిలీ మద్యం వ్యవహారం తొంగిచూసింది. గోవాలో క్వార్టర్ బాటిల్ 15రూపాయలకు దొరుకుతుండడంతో సురేష్ అనే మధ్యవర్తి ద్వారా జిల్లాకు చెందిన కొందరు భారీఎత్తున ఆ మద్యాన్ని దిగుమతి చేయించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల్లోనూ ఆ మద్యాన్ని పంపిణీ చేసారు. అయితే ఈ మద్యం తాగి కొందరు అస్వస్థతకు గురికావడంతో నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఎక్సైజ్ అధికారులు రంగంలోకి దిగి జిల్లాలో పలు చోట్ల నకిలీ మద్యం నిల్వలను పట్టుకున్నారు. ఈ మద్యానికి పరీక్షలు చేయించగా అనుమతించిన దానికంటే అల్కహాల్ శాతం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. దీంతో ఎక్సైజ్ పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేసారు. అయితే ఎక్సైజ్ శాఖ వాళ్లు ఎంతవరకు లాగినా కేసులు ఒక స్థాయి నాయకుల వద్దకే వెళ్లి ఆగుతున్నాయి. కాని వైకాపా ఎమ్మెల్యేలను ఈ నకిలీ మద్యం కేసుల్లో బంధించాలనేది తెలుగుదేశం వారి పంతం. అందుకే ఈ కేసును సిబిఐకి కట్టబెట్టారు. మరి వీళ్ల కోరికను వాళ్లు ఎంతవరకు నెరవేరుస్తారో చూడాలి.

# కలిసివచ్చిన అదృష్టం



**కాలం కలిసొస్తే అదృష్టం వెదుక్కుంటూ వస్తుంది. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి విషయంలో ఇది నిజమైంది. కాలం చాలా సులువుగా కలిసిరాబట్టే ఆయన ఆత్మకూరు నుండి శాసనసభ్యుడిగా ఎన్నిక కాగలిగారు. రాష్ట్రం విభజన సీమాంధ్రలో అందరికీ అన్యాయం చేసింది... కాని మేకపాటి గౌతంకు మాత్రం న్యాయం చేసింది. అదెలాగో పరిశీలిస్తే...**

రాష్ట్ర విభజన పాయింట్ తెరమీదకు రాకముందు ఆత్మకూరులో పరిస్థితి ఎలావుందో ఈ జిల్లాలో అందరికీ తెలుసు. అప్పటికి రాష్ట్రం విడిపోలేదు కాబట్టి తెలంగాణతో కలిపి ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుచుకోగలిగే అతికొద్ది స్థానాలలో ఆత్మకూరు ఒకటిగా ఉండింది. అప్పటికే ప్రజల్లో కాంగ్రెస్ మీద వ్యతిరేకత వున్నప్పటికీ ఆత్మకూరులో మాత్రం ఆనం రామనారాయణరెడ్డి పట్ల అంతటి అభిమానం ఉండింది. ఆర్థిక మంత్రిగా ఆత్మకూరుకు ఆయన చేసిన పనులు, తెచ్చిన నిధులు అన్నీ ఇన్నీ కావు. కాంగ్రెస్‌తో పని లేకుండా ఆనం రామనారాయణరెడ్డిని గెలిపించాలనుకున్నారు ప్రజలు.

అయితే అనూహ్యంగా కాంగ్రెస్ అధిష్టానం రాష్ట్ర విభజనను తెరమీదకు తెచ్చింది. దీంతో ప్రజల్లో కాంగ్రెస్ అంటే అసహ్యం పుట్టింది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్నంత కసి ఏర్పడింది. ఆత్మకూరు నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి వచ్చింది. అయినా ఇక్కడి ప్రజలు ఈ ఒక్క విషయంలో ఆనం రామనారాయణరెడ్డికి మినహాయింపు ఇచ్చారు. కాంగ్రెస్ తప్పు చేసినా, అభివృద్ధి చేసిన ఆనంను ఆదరించాలనుకున్నారు.

అయితే ఇక్కడ ఆనం రామనారాయణరెడ్డి తప్పటడుగు వేసాడు. రాష్ట్ర మంతటా కాంగ్రెస్‌కు వ్యతిరేక వాతావరణం ఉన్నట్లే ఆత్మకూరులోనూ ఉంటుందని భయపడ్డాడు. ముందుగా మున్సిపల్, జడ్పీటీసీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికలను ఆనం సీరియస్‌గా తీసుకోలేదు. దీంతో అంతవరకు ఆయనను అంటి పెట్టుకుని వున్న కేడర్‌లో ఆందోళన రేగింది. ఆనం ఆత్మకూరు నుండి పోటీ చేయడనే ప్రచారం వచ్చేసింది. దీనికి తగ్గట్లు రామనారాయణరెడ్డి తాను ఇక్కడ నుండి ఖచ్చితంగా పోటీ చేస్తానని వారికి హామీ ఇవ్వలేదు. దాంతో అప్పటివరకు ఆయన అనుచరులుగా ఉన్నోళ్లంతా వైకాపా లేదంటే తెలుగుదేశంలలోకి వెళ్లిపోయారు. ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు అసెంబ్లీకి నామినేషన్ వేసే రోజుకు 90శాతం కేడర్ ఇతర పార్టీలలోకి వలసపోయింది. పోటీలోకి దిగాక ఆయన గట్టిగా ఎలక్షన్ చేసింది కూడా లేదు. ఎన్నికలను వదిలేసాడు. ఎలాగూ గెలిచేది లేదులే అనుకున్నాడు. ఆనం రామనారాయణరెడ్డి బలమైన అభ్యర్థిగా ఉంటాడనుకుని తెలుగుదేశంవాళ్లు బలహీనమైన గూటూరు కన్నబాబును అభ్యర్థిగా నిలబెట్టారు. ఇతను స్వతహాగా బలహీనుడు కావడం, ఆనం తనంతట తానుగా బలహీనపడిపోవడంతో మేకపాటి గౌతంరెడ్డి బలమైన అభ్యర్థి అయ్యారు. ఆనం ఎలక్షన్ వదిలేయడంతో 30వేలకు పైగా మెజార్టీతో గెలిచాడు. నెల్లూరు ఎంపీగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి గెలవడానికి కూడా ఇక్కడి మెజార్టీనే దోహద పడింది. మేకపాటి తండ్రీ కొడుకులకు ఆనం రామనారాయణరెడ్డి ఏ జన్మలో ఋణపడ్డాడోగాని ఈ జన్మలో ఈ విధంగా ఆ ఋణాన్ని తీర్చుకున్నాడు.

## • ఖాయమైన వాకాటి చేరిక...

# ముహూర్తమే కుదరాలి!



కాంగ్రెస్ శాసనమండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి తెలుగుదేశంలో చేరడం ఖాయమైపోయింది. కాకపోతే, అధికారికంగా ఏరోజు చేరతాడనేది తేలాల్సివుంది.

ఈమేరకు ఆయన తన మనుషులందరితో మాట్లాడుకోవడం అయిపోయింది. కాగా ఆయనను పార్టీలో చేర్చుకోవద్దంటూ సూళ్లూరుపేట తెలుగుదేశం నాయకులు కొందరు గొడవచేసారు. అయితే ఎమ్మెల్సీ నాయకుడు పార్టీలోకి వస్తానంటే వద్దనడానికి చంద్రబాబు అమాయకుడా?

## మంత్రులు ఉత్సాహపరిస్తేనే...

# రియల్ మార్కెట్ కోలుకునేది

**నెల్లూరుజిల్లా ప్రస్తుతం చాలా నిశ్శబ్దంగా ఉంది. అంతకంటే చాలా నిరుత్సాహంగా ఉందంటే సబబేమో! ఎందుకంటే రోజువారీగా జరిగే సాదాసీదా కార్యక్రమాలు తప్ప ఉత్సాహంగా జరిగే పనులేవీ లేవిక్కడ. దాదాపు నాలుగేళ్లుగా నెల్లూరు మార్కెట్‌లో స్థబ్దత నెలకొంది. ఏ ఒక్క వ్యాపారమూ ఊపుగా జరగడం లేదు. దీనికి కారణం అన్ని వ్యాపారాలకు ఊపు, ఉత్సాహాన్నిచ్చే రియల్ ఎస్టేట్ మార్కెట్ కుదేలు కావడమే!**



దివంగత నేత వై.యస్. ఉన్నంత కాలం నెల్లూరుజిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక పండుగలా ఉండింది. కృష్ణపట్నం పోర్టుతో పాటు అనేక కంపెనీలు, పరిశ్రమలు రావడంతో నెల్లూరుజిల్లా ముఖచిత్రమే మారిపోయే పరిస్థితి వచ్చింది. అనూహ్యంగా కంపెనీలు వాటి సిబ్బంది రావడం, నివాసగృహాలు, అపార్ట్‌మెంట్లకు డిమాండ్ పెరగడంతో అద్దెలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఖాళీస్థలాల ధరలు, భూముల ధరలు, అపార్ట్‌మెంట్లలో ప్లాట్ల ధరలు పీఎస్ఎల్‌వి రాకెట్‌లా నింగికి దూసుకుపోయాయి. అపార్ట్‌మెంట్లకు వచ్చిన డిమాండ్ చూసి బిల్డర్‌లు అయితే నెల్లూరులో ఏకంగా ఒకేసారి 200కుపైగా అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టారు. రియల్టర్‌లు భారీ ధరలకు భారీ ఎత్తున భూములు కొనుగోలు చేసి వెంచర్లు వేసారు. అయితే వై.యస్. మరణంతో జిల్లా రియల్‌ఎస్టేట్ ఒక్కసారిగా పడిపోయింది. కొన్ని పరిశ్రమలు వెనక్కిపోయాయి. తదనంతరం ఏర్పడిన రాజకీయ శూన్యతతో జిల్లాకు కొత్త ప్రాజెక్ట్‌లు రాలేదు. దీంతో ప్లాట్లకు, స్థలాలకు, భూములకు డిమాండ్ తగ్గిపోయింది. దాదాపు నాలుగున్నర సంవత్సరాలుగా నెల్లూరుజిల్లాలో రియల్ మార్కెట్ స్థబ్దుగా వుంది. చాలామంది వ్యాపారులు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆస్తులు అమ్మారు. ఇంకొందరైతే ఐ.పి కూడా పెట్టారు.

నెల్లూరులో రియల్ మార్కెట్ ఇప్పటికైనా కోలుకోకుంటే ఇంకా చాలా మంది దెబ్బతినే అవకాశముంది. ఈ దెబ్బతినే వారిలో సన్న జనం కూడా ఉన్నారు.

రియల్టర్‌లు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, జిల్లా మంత్రి నారాయణలపై ఎంతో ఆశతో ఉన్నారు. జిల్లా అభివృద్ధికి వాళ్లిద్దరూ సమగ్ర ప్రణాళికను రూపొందిస్తే, నెల్లూరును స్మార్ట్‌సిటీ జాబితాలో చేర్చడంతోపాటు జిల్లాకు కొన్నైనా ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లు తీసుకురాగలిగితే ఈ జిల్లాలో రియల్ మార్కెట్ మళ్లీ గాడిలో పడే అవకాశముంది.

# ఉత్తేజం నింపిన ప్రధాని ప్రసంగం



శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఫలాలు సామాన్య ప్రజల దరిచేరినప్పుడే వాటికి సార్ధకత వుంటుందని, ఆ దిశగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరిన్ని ప్రయోగాలు చేయాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగం యావద్భారత దేశ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది.

సోమవారం శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి నిప్పులు కక్కుతూ నింగికెగసిన పిఎస్ఎల్‌వి సి-23 ప్రయోగం దిగ్విజయం అయ్యాక, శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రధాని చేసిన ప్రసంగం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. షార్‌కు వచ్చి, స్వయంగా ఆయన ఈ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించడం, ప్రయోగ విజయంతో కరతాళధ్వనులు చేయడం, శాస్త్రవేత్తల వద్దకు తానే నేరుగా వెళ్లి వారిని భుజం తట్టి ప్రోత్సహించడం శాస్త్రవేత్తలకు మరింత ఉత్తేజాన్ని ఇచ్చింది. ఈ రాకెట్ ప్రయోగాన్ని వీక్షించేందుకు ప్రధాని షార్‌కు విచ్చేసినప్పుడు ప్రయోగానికి సంబంధించిన అంశాలన్నిటినీ శాస్త్రవేత్తలు ప్రధానికి క్షుణ్ణంగా వివరించారు. రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తూ, రాకెట్ ప్రయోగసమయంలో ఎంతో ఉద్విగ్న వాతావరణం వుండగా, ప్రయోగం విజయం కావడంతోనే ప్రధాని ఆనందంతో కరతాళధ్వనులు చేశారు. ఈ సందర్భంగా ప్రధాని శాస్త్రవేత్తలను ఉద్దేశించి నరేంద్రమోదీ మాట్లాడుతూ, ఇస్రో విజయపరంపరలో మరో అద్భుతవిజయానికి తాను ప్రత్యక్ష సాక్షి అయినందుకు గర్వపడుతున్నానన్నారు. వరుస విజయాలతో అంతరిక్ష పరిశోధనల్లో భారత్ సత్తాను ఇస్రో మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన కొనియాడారు. ప్రతి భారతీయుడు గర్వపడే సమయం ఇది.. అని ఆయన పొంగిపోయారు. అంతరిక్ష రంగంలో భారతదేశం ఒక నజరానా కావాలన్నారు. మన శాస్త్రవేత్తలు ఇరుగుపొరుగు దేశాలను దృష్టిలో వుంచుకుని 'సార్క్' ఉపగ్రహం రూపొందించాలని ఆయన ఆకాంక్షించారు. సార్క్ దేశాల కోసం ఓ భారీ ఉపగ్రహాన్ని కానుకగా ఇస్రో శాస్త్రవేత్తలు ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. మన శాస్త్రవేత్తల కృషి ఫలాలను వృధాగా పోనివ్వకూడదని, అవి పరిపాలనలో భాగం కావాలని, అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని, సామాన్యులకు అందుబాటులో వుండాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. అంతరిక్ష పరిశోధనలు సేవారంగంలోనూ కీలకంగా వుండాలని, మానవీయ దృక్పథంతో ముందుకు సాగాలని అంటూ అందరిలోనూ మరింత స్ఫూర్తిని నింపారు. హాలీవుడ్ సినిమాలకు అయ్యేంత ఖర్చు కూడా ఇలాంటి ఉపగ్రహ నిర్మాణాలకు వ్యయం కావడం లేదని, ఇలాంటి ఉపగ్రహాలను రూపొందించడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం వుంటుందని ఆయన శాస్త్రవేత్తలకు బాగా ఉత్తేజాన్నిచ్చారు. మానవ వనరులకు కొదవలేని మనదేశంలో శాస్త్ర సాంకేతిక రంగాన్ని అందిపుచ్చుకుని అన్ని రంగాల్లో ముందుకు సాగాలని, జాతి సమగ్రాభివృద్ధికి యువశాస్త్రవేత్తలు కృషి చేయాలని ఆయన ఉద్బోధించారు. ఇలా దాదాపు 25నిమిషాల పాటు.. అటు ఆంగ్లంలోనూ, ఇటు హిందీలోనూ ప్రధాని ప్రసంగించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఆయన ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా సాగడం అక్కడున్నవారందరికే కాక, దేశ ప్రజలందరిలోనూ సరికొత్త స్ఫూర్తి నింపినట్లయింది. గతంలో రాకెట్ ప్రయోగ వీక్షణకు విచ్చేసినవారు ఎందరో వున్నా, ప్రధాని మోదీలా ఇంతసేపు అత్యద్భుతంగా, ప్రసంగించిన వారెవరూ లేరని శాస్త్రవేత్తలు సైతం భావిస్తున్నారు. ఏదేమైనా, గుండెల నిండా ఉత్తేజాన్ని నింపిన ప్రధాని మోదీ ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

# గురువుల ఇంటికి గురువు

'దేశానికి రాజైనా తల్లికి బిడ్డే' అంటారు. అలాగే తాను లక్షలాదిమంది విద్యార్థులకు గురువు అయినా, ఆ గురువుకు కూడా మరో గురువు ఉంటారు. మనం ఏ స్థాయికి ఎదిగినా ఆ గురువులను మరిచిపోకుండా ఉండడమే ఉత్తమ సంస్కారం అనిపించుకుంటుంది. ఒక సాధారణ పేద కుటుంబం నుండి వచ్చి ఈరోజు రాష్ట్రమంత్రి హోదాలో ఉన్న రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ కూడా తన గురువులను మరచిపోలేదు. గత నెల 30వ తేదీ మంత్రి హోదాలో తొలిసారి నెల్లూరొచ్చిన ఆయన అదే హోదాలో తన గురువుల ఇంటికి వెళ్ళి తన సంస్కారాన్ని చాటుకున్నారు. తనకు చిన్నతనంలో విద్యాబుద్ధులు నేర్పించి, తాను ఎదగడానికి ఎంతగానో దోహదం చేసిన తన గురువు జె.వి.నారాయణమూర్తి ఇంటికి వెళ్లారు. ఆయన కుటుంబసభ్యులతో ఆత్మీయంగా మాట్లాడారు. అలాగే విద్యారంగంలో తనకు గురువులాంటి రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం ఇంటికి వెళ్లారు. అక్కడ వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. తాను చిన్నతనంలో చదువుకున్న స్కూల్‌ను సైతం ఆయన సందర్శించి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు.

# స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రతిభాపురస్కారాలు

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ఆవరణలో ఈ నెల 5న ప్రతిభకు పురస్కారం - 2014 కార్యక్రమం జరుగనున్నట్లు ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్, ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మెన్ ముప్పవరపు హర్షవర్ధన్‌లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా॥ కామినేని శ్రీనివాస్, గౌరవఅతిథిగా నెల్లూరులోని విట్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కులపతి డా॥ జి.విశ్వనాథ్‌లు పాల్గొంటారని తెలిపారు.


### ఉచిత మెగా వైద్యశిబిరం

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 5న హైదరాబాద్ లోని స్టార్ హాస్పిటల్, ఎల్‌వి ప్రసాద్ కంటి వైద్యశాల, నెల్లూరులోని నారాయణ దంత కళాశాల వైద్య నిపుణులచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించబడుతుందని ట్రస్ట్ సిఇఓ కె.ప్రదీప్ తెలిపారు. గుండె, మెదడు, దంతములు, కంటివ్యాధులకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్యశిబిరాన్ని నిర్వహిస్తారని, నిష్ణాతులైన వైద్యనిపుణులు సూచనల మేరకు అవసరమైనవారికి ఎక్స్‌రేలు, 2డి ఎకోల్యాబ్ పరీక్షలు ఉచితంగా జరిపి సలహాలు ఇస్తారని తెలిపారు. కంటిచూపు మందగించిన వారికి పరీక్షలు జరిపి ఉచితంగా కంటి అద్దములు ఇస్తారని, కంటి ఆపరేషన్లు చేస్తారని పేర్కొన్నారు.

# మనిషిని మానవతామూర్తిగా తీర్చిదిద్దేదే సాహిత్యం

## - 'అనురాగవనం' పుస్తకావిష్కరణ సభలో మండలి బుద్ధప్రసాద్

### త్రీడీ ముఖచిత్రంతో ప్రపంచంలోనే తొలి పుస్తకం



'అనురాగవనం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, కె.అనిల్‌కుమార్ తదితరులు

'సాహిత్యం విశ్వశాంతిని, విశ్వ శ్రేయస్సును కాంక్షించేదిగా వుండాలి.. సమాజానికి ఉపకరించేవిధంగా రచనలు వుండాలి, అంతేకాదు, సాహిత్యం మనిషిని మహనీయమైన వ్యక్తిగా.. మానవతామూర్తిగా తీర్చిదిద్దేదిగా వుండాలి' అని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఇటీవల చెన్నైలోని శ్రీ వేణుగోపాల విద్యాలయంలో జరిగిన 'అనురాగవనం' పుస్తకావిష్కరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పుస్తక ప్రపంచంలోనే తొలి త్రీడీ ముఖచిత్రం కలిగిన ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత ప్రణవి రచించారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త, తెలుగు సమైక్య వేదిక అధ్యక్షులు కె.అనిల్‌కుమార్ రెడ్డికి ఈ పుస్తకాన్ని అంకితం చేశారు. మండలి బుద్ధప్రసాద్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. చెన్నై విజయవాహిని స్టూడియోస్ అధినేత బి. విశ్వనాథరెడ్డి అధ్యక్షత వహించిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆద్యంతం ఎంతో వేడుకగా జరిగింది. 'అనురాగవనం' తొలి ప్రతిని జనోదయం ప్రాజెక్టు డైరెక్టర్ గొల్లపల్లి ఇజ్రాయేల్‌కు అందజేశారు. అనురాగవనం పుస్తకాన్ని ప్రముఖ సినీ గేయ రచయిత భువనచంద్ర తెలుగులో అనువాదం చేయగా, ఉభయ భాషా రచయిత బషీర్ అహ్మద్ హిందీలో ఈ పుస్తకాన్ని సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, రచయిత ప్రణవి మహోన్నతమైన ఆశయాలతో రచనలు సాగిస్తున్నారని ప్రశంసించారు. అనురాగవనం పుస్తకం ప్రపంచంలోనే తొలిసారి త్రీడీ ముఖచిత్రంతో తీసుకురావడం సంతోషకరమని, ఆ ఘనత తెలుగు వారికి దక్కడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. కుల మతాలకు అతీతంగా మానవతా దృక్పథంతో మానవులు జీవించాలన్నది అనురాగవనం ఆశయంగా కనిపిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ నవల చదివితే మంచి భావాలు మనసులో మెదులుతాయని అన్నారు. ప్రకృతి ప్రేమికుడైన రచయిత ప్రణవి ఈ పుస్తకంలో గంగానది ప్రక్షాళనలకు అవసరమైన చక్కని సూచనలు చేశారని అభినందించారు. ఇలాంటి మంచిపుస్తకాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్‌కుమార్‌రెడ్డికి అంకితమివ్వడం ఎంతో సంతోషకరమన్నారు. తెలుగు భాషాభ్యున్నతికి కృషి చేయాలన్న తపన ఆయనలో కనిపిస్తోందని కొనియాడారు. ప్రపంచంలోనే తొలిసారిగా త్రీడీ ముఖచిత్రంతో తెలుగు పుస్తకాన్ని వెలువరించి, ప్రపంచ సాహిత్యంలో తెలుగుభాషకి సమున్నత గౌరవం కల్పించారని ఈ సందర్భంగా రచయిత ప్రణవిని మండలి బుద్ధప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీగేయ రచయిత భువనచంద్ర మాట్లాడుతూ, ప్రకృతి వినాశనానికి కారణమవుతున్న అనేకానేక అంశాలను రచయిత ఎంతో లోతుగా పరిశీలించి విశ్లేషించారని, వనానికి మానవునికీ వున్న అనుబంధాన్ని రచయిత చక్కగా విశదీకరించారని అంటూ, ఈ పుస్తకం అందరూ తప్పకుండా చదవాల్సిన పుస్తకమని ప్రశంసించారు. ప్రముఖ డబ్బింగ్ కళాకారుడు ఘంటసాల రత్నకుమార్ ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అలి కాంతీలాల్ డి.షా ప్రత్యేక అతిథిగా పాల్గొని రచయిత ప్రణవిని అభినందించారు. అనంతరం ప్రణవి తన స్పందనను తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రముఖ కూచిపూడి నాట్యకళాకారులు వెంపటి చినసత్యం కోడలు శ్రీమోయి వెంపటి శిష్యులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. కూచిపూడి ఆర్ట్ అకాడమీ తరపున వెంపటి చినసత్యం మనుమరాలు లక్ష్మీ కామేశ్వరి, బాల నృత్య కళాకారులు అమర్‌నాథ్‌ఘోష్, సహన, శివకుమార్ తదితరులు పాల్గొని కూచిపూడి నృత్యాలను అత్యద్భుతంగా ప్రదర్శించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షులు డా.మాడభూషి సంపత్ కుమార్, ప్రముఖ నిర్మాత కాట్రగడ్డ మురారి, ప్రముఖ సినీ రచయిత వెన్నెల కంటి, ప్రముఖులు గుడిమెట్ల చిన్నయ్య, జెకె రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైన్ సమాజ సేవాతత్పరులైన పలువురిని సేవారత్న అవార్డులతో ఘనంగా సత్కరించారు.


## పంచమ వర్ధంతి



జననం : 07-02-51

మరణం : 06-07-09

మమతల మణిదీపం, మా మనసుల్లో చెదరని రూపం

స్వర్గీయ జక్కా సౌదామిని గారు

శివ సాన్నిధ్యం పొంది ఐదేళ్ళు గడుస్తున్న సందర్భంగా...

ఆ పుణ్యమూర్తి దివ్యస్మృతిని స్మరిస్తూ...

తేది. 12-07-14(గురుపూర్ణిమ), శనివారము
మనుబోలులోని మా ఆయిల్‌పామ్ తోట వద్ద
ఉదయం 11గంటల నుండి
సంస్మరణ కార్యక్రమం జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

జె.ఎస్.రెడ్డి (భర్త)
మరియు
కుటుంబసభ్యులు




## ఆస్తులపై మోజుతోనే

తెలంగాణవాళ్లు తన్ని తరిమేసినా హైదరాబాద్ నుండి సినీ పరిశ్రమను కదిలించేది లేదని 'మా' అధ్యక్షుడు మురళీమోహన్ చెప్పడం శోచనీయం. ఆయనకు అక్కడ విలువైన ఆస్థులున్నాయి. కాబట్టే హైదరాబాద్‌ను వదలనంటున్నాడు. సినీ పరిశ్రమను సీమాంధ్రకు తరలిస్తే ఈ ప్రాంతం బాగుపడుతుంది. సీమాంధ్రలో ఎంపీగా ఉంటూ హైదరాబాద్‌ను వదిలి రాలేమని మురళీమోహన్ అనడం సిగ్గుచేటు.

జి.నాగబాబు, మైపాడు.

## ఫలితాల విశ్లేషణ బాగుంది

తేది 23-5-14నాటి సంచికలో ఎన్నికల ఫలితాలపై 'లాయర్' విశ్లేషణ చాలా చక్కగా వుంది. 'శిక్ష కాదు... శిక్షణ' అన్న శీర్షికలో వాస్తవ పరిస్థితిని బాగా వివరించారు. 'అసామాన్యుడు' అనే శీర్షికలో ప్రధాని మోదీ ప్రస్థానాన్ని వర్ణించిన తీరు బాగుంది. ప్రజల మనోభావాలను పట్టించుకోని పనబాక లక్ష్మికి ఏం గతి పట్టిందో వివరించారు.

కాకుటూరి సుబ్రహ్మణ్యం, కావలి.

## ధర్మసందేహం

ఎన్‌డిఏకు మిత్రపక్షమైన తెలుగుదేశంకు కేంద్రంలో మంత్రి పదవులు ఇచ్చే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ ఎంపీల ట్రాక్‌రికార్డు బాగుంటేనే మంత్రి పదవులు ఇస్తానని చంద్రబాబుతో చెప్పినట్లు వార్తాకథనం. తెలుగుదేశంతో జత కట్టి 'మాకు తెలుగుదేశంతో కెమిస్ట్రీ కుదిరింది' అన్నాడు మోడీ. కెమిస్ట్రీ కుదిరేముందు చంద్రబాబు ట్రాక్ రికార్డు మోడీ చూడలేదా? లేక వెంకయ్యనాయుడు మోడీకి బాబు ట్రాక్‌రికార్డు గురించి చెప్పలేదా?

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## బడుగులకు స్థానం

వైయస్సార్‌సీపీ శాసనసభాపక్ష కమిటీలో బడుగుబలహీన వర్గాలకు ప్రాధాన్యతనిస్తూ నెల్లూరునగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను కార్యనిర్వాహక సభ్యునిగా నియమించడం అభినందనీయం.


బి.ఆర్.శాలి, కావలి.

## 'ప్రభా'తం

ఈ వారం.. ఒకవిధంగా చెప్పాలంటే విషాద వారం అనే చెప్పాలి. అటు కోనసీమలోనూ, ఇటు చెన్నై, ఢిల్లీల్లోనూ జరిగిన ఘోర ప్రమాదాలు వింటేనే గుండెలు తరుక్కుపోతున్నాయి. అభం శుభం తెలియనివారు ఎంతోమంది ఈ దుర్ఘటనల్లో కన్నుమూశారు. ఈ విషాదాలను చూసి తట్టుకోలేక మృతుల కుటుంబాలు శోక సముద్రాలే అవుతున్నాయి.

ఇలాంటి దుర్ఘటనల్లో ఎవరి నిర్లక్ష్యానికో.. ఎవరి స్వార్థానికో.. మరెవరో బలైపోతుండడం తీవ్ర ఆవేదన కలిగించే విషయం. అయినా..బాధితులను ఏమని ఓదార్చగలం?.. కోనసీమలో మాడిన కొబ్బరాకుల్లా 18 మంది మంటల్లో మలమల మాడిపోయారు. మరోవైపు చెన్నైలో, ఢిల్లీలో భవనాలు కుప్పకూలిపోయిన ఘటనల్లో మరో 42 మంది దుర్మరణం పాలయ్యారు. శిథిలాల కింద మరెందరు వున్నారో?.. ఈ విషాదాలతో బాధిత కుటుంబాల గోడు హృదయవిదారకంగా వుంది. మనం వేసుకున్న పైప్‌లైన్లు మనకే మృత్యుపాశాలవుతుంటే.. మనం కట్టుకునే భవనాలు మనమీదనే కుప్పకూలిపోయి, మన ప్రాణాలు బలితీసుకుంటుంటే ఎవరికి చెప్పుకోవాలి?.. ఈ దుర్ఘటనలన్నిటికీ మానవ తప్పిదాలే కారణం. అందుకు నిదర్శనంగా.. కోనసీమలోని తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండలంలో.. కొబ్బరిచెట్లతో కళకళలాడే 'నగరం' అనే కుగ్రామం ఇప్పుడు స్మశానంలా మారిపోయింది. గెయిల్ సంస్థ నిర్వహించే గ్యాస్ పైపులైన్ పగిలి హఠాత్తుగా ఎగజిమ్మిన మంటలు మృత్యుపాశాల్లా మారి ఆ గ్రామంలోని పలువురిని బలి తీసుకున్నాయి. జూన్ 27వతేదీన తెల తెలవారుతుండగా జరిగిన ఈ దుర్ఘటన మానవ తప్పిదానికి సాక్షీభూతంగా నిలిచిపోయింది. సుమారు పదేళ్ళ క్రితం ఈ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసినా, వాటి నిర్వహణలో నిర్లక్ష్యం ఇప్పుడు నగరంలోని పలు కుటుంబాల పాలిట నరకంగా మారింది. పైప్‌లైన్ పేలుడు జరిగి అంతమంది చనిపోవడమే కాక, ఆ గ్రామంలో అగ్నికీలలకు భస్మీపటలమైన ఆ ప్రాంతం పచ్చదనం కోల్పోయి నల్లగా..మసిబొగ్గుల్లా..వల్లకాడులా మారిపోయింది. హఠాత్తుగా ఎగిసిన మంటలకు సమీపంలోనే వున్న పలువురు హాహాకారాలు పెడుతూ మృత్యు కోరలకు బలైపోతే, మరికొంతమంది ఆ మంటలు సోకి తీవ్రగాయాలతో అల్లాడిపోయారు. జాతీయ స్థాయిలో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని చెప్పుకునే ఆ సంస్థ నిర్వాకం 18 మంది నిండుప్రాణాలను పొట్టన బెట్టుకుందంటూ బాధిత కుటుంబాలు పెద్దపెట్టున రోదిస్తున్నాయి. అసలు, ఇలాంటి ప్రమాదకరమైన గ్యాస్‌పైప్‌లైన్లు గ్రామాల్లో జనావాసాల మీదుగా వేయడం మొదటి తప్పిదం. ఊరికి దూరంగా, ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేయాలే తప్ప గ్రామాల్లోనే గుంతలు తవ్వి పైప్‌లైన్లు వేస్తే..ఇలాంటి ప్రమాదాలు జరిగినపుడు జననష్టం, ఆస్తినష్టం తీవ్రంగా వుంటాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అయినా, ఎవరు పట్టించుకుంటున్నారు?.. పైప్‌లైన్లు వేసేసి చేతులు దులుపుకోవడం, వాటి నిర్వహణపై ఎలాంటి శ్రద్ధ చూపకపోవడం వంటివన్నీ ఈ ప్రమాదానికి కారణాలేనని అందరూ అంటున్నారు. పేలుడు జరిగిన తర్వాత, ఈ పేలుడు ఎందుకు సంభవించిందనే పూర్తిస్థాయి వివరాలు సేకరిస్తున్న కేంద్ర హైపవర్ కమిటీ ఈ దుర్ఘటన ప్రాంతానికి వచ్చి పరిశీలించినప్పుడు.. అసలు జనావాసాల మధ్య ఇలా పైప్‌లైన్ వేయడమేమిటని ఆశ్చర్యపోవడం గమనార్హం. జనం నివసించే ప్రాంతాల్లో ఇలాంటి పైప్‌లైన్లు వేసినప్పుడు, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. అవి ఎలాంటి ప్రమాదానికి లోనుకాకుండా చూడాలి. అది కనీస బాధ్యత. కోట్లాది రూపాయలు లాభాలు సంపాదించే ఇలాంటి సంస్థలు.. ఎంతో ముఖ్యమైన పర్యవేక్షణను గాలికి వదిలేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. భూమి లోపల రెండు మీటర్ల లోతులో పైప్‌లైన్లు అమర్చివున్నా, ఆ పైప్‌లైన్లపై వున్న భూ ఉపరితలం మీద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పైప్‌లైన్లకు పైభాగంలోనే కాక, నిర్ణీత పరిధిలో ఎలాంటి నిర్మాణాలు జరుగకుండా చూడాలి. అయితే, అలాంటివేమీ పట్టించుకోకపోవడం వల్లనే, కేవలం మానవ తప్పిదాల వల్లనే ఈ ఘోరం జరగడం ఎంతో దురదృష్టకరం. అదేవిధంగా, భవనాల నిర్మాణాల్లోనూ తరచూ ఘోరప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. చెన్నై సమీపంలోని మొగలివాక్కంలో ఇటీవల నిర్మాణంలో వున్న ఓ పదకొండంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అన్ని అంతస్తుల నిర్మాణానికి అను మతులు లేకున్నా, నిర్లక్ష్యంగా నిర్మాణం చేపట్టడం వల్లనే భవనం కూలిపోయిందని అక్కడి వారు అంటున్నారు. ఈ దుర్ఘటనలో 32మంది మృతి చెందడం, పలువురు తెలుగువారు కూడా బాధితుల్లో వుండడం విచారకరం. అదే రోజున దేశ రాజధాని ఢిల్లీలోనూ ఒక పురాతన భవనం కుప్పకూలి పోయింది. మృతుల్లో అయిదుగురు చిన్నారులతో పాటు, ముగ్గురు మహిళలు కూడా వున్నారు. భవనం పక్క ప్లాట్లలో వున్న వారు అక్రమంగా నిర్మాణపనులు చేస్తుండగా, ఈ భవనం కూలిపోయిందనే ఆరోపణలు వచ్చాయి.

ఇలా.. ఎక్కడికక్కడ మానవ తప్పిదాలతో ఘోర ప్రమాదాలు వాటిల్లుతూనే వున్నాయి. దుర్ఘటన ఏదైనప్పటికీ, నష్టం జరిగిపోయాక బాధపడేకంటే, అసలు ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వుండడం ఎంతైనా అవసరమని ఈ దుర్ఘటనలు మళ్ళీ మళ్ళీ చెప్తున్నాయి. అటు ప్రభుత్వాలు సైతం ఇలాంటి సంఘటనలను లోతుగా పరిశీలించాలి. ప్రమాదాలకు ప్రజల ప్రాణాలు బుగ్గిపాలు కాకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలకు కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఇకనైనా అప్రమత్తతతో గట్టి చర్యలు తీసుకోవాలి.



### మానవ తప్పిదాలు

దుర్ఘటన ఏదైనప్పటికీ, నష్టం జరిగిపోయాక బాధపడేకంటే, అసలు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటూ అప్రమత్తంగా వుండాలి. అటు ప్రభుత్వాలు సైతం ఇలాంటి సంఘటనలను లోతుగా పరిశీలించాలి. ప్రమాదాలకు ప్రజల ప్రాణాలు బుగ్గిపాలు కాకుండా ఎప్పటికప్పుడు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

## 'అంతర్'జాతీయం

- హిమాలయాలలో దక్షిణకాశ్మీర్‌లో సముద్ర మట్టానికి 3880 మీటర్ల ఎత్తులో వున్న అమర్‌నాథ్ యాత్ర పటిష్టమైన బందోబస్తు మధ్య కొనసాగుతుంది. జమ్మూకాశ్మీర్ గవర్నర్ అమర్‌నాథ్‌జీ దేవస్థానం మండలి ఛైర్మెన్ ఎన్.ఎన్.వోరా పవిత్ర గుహ వద్ద తొలిపూజలు నిర్వహించి 44రోజుల అమర్‌నాథ్‌యాత్రను ప్రారంభించారు.
- చైనా అధికారిక పటాల్లో అరుణాచల్‌ప్రదేశ్‌ను చేర్చడంపై భారత ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పటాల్లో చేర్చినంత మాత్రాన భూమ్మీద వాస్తవ పరిస్థితులు మార్చలేరని, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం భారత్‌లో అంతర్భాగమని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి పేర్కొన్నారు.
- భారత్‌కు చెందిన సైకతశిల్పి సుదర్శన్ పట్నాయక్‌కు 2014సంవత్సరానికి గాను పీపుల్స్ ఛాయిస్ పతకం లభించింది. అమెరికాలోని అట్లాంటా నగరంలో జరిగిన 'వరల్డ్ కప్ ఆఫ్ శాండ్ స్కల్పటింగ్ – 2014' పోటీలలో పట్నాయక్‌కు ఈ బహుమతి లభించింది.
- భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనానెహ్వాల్ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. సిడ్నీలో ఆదివారం జరిగిన ఫైనల్‌లో కరోలినా మాలిన్(స్పెయిన్)పై విజయం సాధించి విజేతగా నిలిచింది.
- ఒడిసాలోని పూరీలో ప్రతియేటా అత్యంత వైభవంగా నిర్వహించే జగన్నాథ రథయాత్రను జూన్ 29వ తేదీ ఘనంగా నిర్వహించారు. దాదాపు 10లక్షల మంది భక్తులు ఈ రథయాత్రలో పాల్గొన్నారు. ఒడిసా గవర్నర్ జమీర్, ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్, కేంద్రమంత్రులు జుయెల్ ఓరాం, ధర్మేంద్రప్రధాన్‌లు కూడా ఈ రథయాత్రలో పాల్గొన్నారు.
- అమెరికా గూఢాచార సంస్థ నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ 2010లో మన దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీల్లో ఒకటైన బీజేపీపై నిఘా పెట్టినట్లు వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా ఐదు రాజకీయపార్టీలపై అమెరికా నిఘా పెట్టింది. వీటిలో బీజేపీతో పాటు లెబనాన్‌కు చెందిన 'అమల్', వెనిజులాలోని 'బొలీవరియన్ కాంటినెంటల్ కో–ఆర్డినేటర్', ఈజిప్టులోని ముస్లిం బ్రదర్‌హుడ్, పాకిస్థాన్‌లోని పాకిస్థాన్ పీపుల్‌పార్టీలు ఉన్నట్లు వాషింగ్టన్ పోస్ట్ వెల్లడించింది. దీనిపై భారత విదేశాంగశాఖ తీవ్రంగా స్పందించింది. భారత్‌లోని ఒక పౌరుడిపైగాని, ఒక సంస్థపై గాని నిఘా పెట్టడం ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని, ఇది భారత్‌లోని వ్యక్తిగత స్వేచ్ఛా చట్టాలకు వ్యతిరేకమని భారత విదేశాంగశాఖ ప్రతినిధి పేర్కొన్నారు.

## వార్త వ్యాఖ్య

| | | |
|---|---|---|
| వార్త | :- | రైతు ఋణాలు మాఫీ చేసి తీరుతాం. – మంత్రి పల్లె రఘునాథరెడ్డి. |
| **వ్యాఖ్య** | **:-** | ***మళ్ళీ వచ్చే ఎన్నికల దాకా ఇదే చెప్పేటట్లున్నారు.*** |
| వార్త | :- | చంద్రబాబు మారాడు. – ఎన్జీఓ నేత అశోక్‌బాబు. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఫేస్‌కు ప్లాస్టిక్ సర్జరీ ఏమన్నా చేయించాడేమో!*** |
| వార్త | :- | కరెంట్ ఆదాకు ప్రాధాన్యం. – ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కృష్ణారావు. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఫ్యాన్‌లకు బదులు విసనకర్రలు, లైట్లకు బదులు కిరోసిన్ దీపాలు, కొవ్వొత్తులు వాడమంటే సరి!*** |
| వార్త | :- | విద్వేషాలు రెచ్చగొట్టడం కేసీఆర్‌కు తగదు. – చంద్రబాబు. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఆయన్ను సీఎం చేసిందే అది... ఎందుకు వదులుకుంటాడు.*** |
| వార్త | :- | పీవీకి భారతరత్న ఇవ్వాలి. – కేసీఆర్. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఇప్పుడు కాంగ్రెస్ లేదు కాబట్టి ఇవ్వొచ్చులే!*** |
| వార్త | :- | దేశంలో ఎన్నికల సంస్కరణలు రావాలి. – సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఈ ఎన్నికల విధానం మీకు కలిసిరావడం లేదనా?*** |
| వార్త | :- | సభలో హుందాగా మెలగండి. – ఎంపీలకు స్పీకర్ హితవు. |
| **వ్యాఖ్య** | **:-** | ***ముందు హుందాతనమంటే ఏంటో వివరించండి.*** |
| వార్త | :- | రాహుల్‌కు ప్రధాని సరకు లేదు. – బీజేపీ. |
| **వ్యాఖ్య** | **:-** | ***ప్రతిపక్ష నేత సరకే లేదని ఆయనే ఒప్పుకున్నాడు కదా!*** |
| వార్త | :- | అమరావతి కేంద్రంగా రాజధాని? |
| **వ్యాఖ్య** | **:-** | ***ఒక్కో నెలలో ఒక్కో ఊరి పేరు ప్రచారంలోకి తెస్తే అన్ని చోట్లా భూముల రేట్లు పెరుగుతాయి.*** |
| వార్త | :- | జైసమైక్యాంధ్ర పార్టీ కార్యాలయం మూత. |
| **వ్యాఖ్య** | **:-** | ***ఇక ఒకరోజు పెట్టుకున్నా అద్దె దండగ కదా!*** |
| వార్త | :- | పటిష్టంగా మద్యం విధానం అమలు చేయండి. – ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర. |
| **వ్యాఖ్య** | **:-** | ***పటిష్టంగా అంటే తాగుబోతులను పెంచడమా?*** |

# కష్టాల్లో..కోళ్ళ పరిశ్రమ

- వ్యయం బోలెడు.. ఆదాయం చారెడు
- పెరుగుతున్న మేత ధరలు
- నష్టాల్లో రైతులు

*జిల్లాలో ఒకప్పుడు కోళ్ళ పరిశ్రమ కళకళలాడుతూ వుండేది. అనేక గ్రామాల్లో కోళ్ళ ఫారాలు విస్తారంగా వుండేవి. కోడిగుడ్ల ఉత్పత్తికి, మాంసానికి లోటు వుండేది కాదు. అనేకమంది రైతులు, ప్రజలు స్వయం ఉపాధిగా కోళ్ళ ఫారాలు పెట్టుకుని జీవనం సాగించేవారు.*

అయితే, ఇప్పుడు ఆ కాలం పోయింది. నిర్వహణా వ్యయం పెరిగిపోయి, ఆదాయం నామమాత్రమైంది. దీంతో జిల్లాలో రానురాను కోళ్ళఫారాలు తగ్గిపోయాయి. కోళ్ళకు ఎప్పుడు ఎలాంటి వ్యాధులు వస్తాయోనని పెంపకందార్లలో నిత్యం ఆందోళనే వుండేది. అందుకు తగ్గట్టుగానే గతంలో నేలమీదనే కోళ్ళను పెంచే విధానం (డీప్‌లిట్టర్)తో కోళ్ళ ఫారాలు విస్తారంగా వుండేవి. ఆ విధానం వల్ల కోళ్ళు అధికశాతం రోగాల బారిన పడుతుండడంతో నష్టాలు అధికంగా వుండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి నుంచి కొంత ఉపశమనం దొరికింది. ఇటీవలికాలంలో అధునాతనంగా ఇనుపకమ్ములమీద, బాక్స్‌ల్లో కోళ్ళను పెంచే కేజెస్ పద్ధతి వచ్చాక, కొంతమంది రైతులు ఆ పద్ధతిలో కోళ్ళ ఫారాలను నిర్వహించుకుంటున్నారు. ఎంతో శ్రమతో వాటిని కాపాడుకుంటూ, అవి నష్టాల బాట పట్టకుండా చూసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పుడు సుమారు అయిదు లక్షల దాకా కోళ్ళు వున్నాయని ఒక అంచనా. జిల్లాకు రోజుకు కనీసం ఎనిమిది లక్షల గుడ్లు కావాల్సివుండగా, కేవలం మూడు లక్షల గుడ్లు దాకా ఉత్పత్తి అవుతున్నాయని తెలుస్తోంది. దీంతో, మిగిలిన కోడిగుడ్లను తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సివస్తోందని పౌల్ట్రీవర్గాల సమాచారం. ఇదిలావుంటే, గత వారం రోజులుగా కోడిగుడ్ల ధర కొంత ఆశాజనకంగానే వున్నప్పటికీ, రోజురోజుకు పెరుగుతున్న ఖర్చులు చూస్తే, నష్టాలు రాకుండా ఈ వ్యాపారం చేయడం కష్టసాధ్యమే అవుతోందని రైతులు అంటున్నారు. వాస్తవానికి కోళ్ళ ఫారాల నిర్వహణ ఖర్చు నానాటికీ బాగా పెరుగుతుండడం, కోళ్ళకు నిత్యం వేసే దాణా ఖర్చు విపరీతంగా పెరుగుతుండడం కోళ్ళరైతులకు కంటికి కునుకు పట్టనీయడం లేదనే చెప్పాలి. ఎప్పుడో కొన్ని రోజుల్లో తప్ప అటు కోడిగుడ్ల ధర కానీ, ఇటు కోడి మాంసం ధర కానీ సాధారణ రోజుల్లో ఏమంత ఆశాజనకంగా వుండడం లేదని, మంచి ధరలు లేకపోతుండడంతో ఈ పరిశ్రమ రానురాను కుదేలై పోతోందని నెక్ లోకల్ కమిటీ ఛైర్మన్ కె.రాఘవరావు, నెక్ మాజీజోనల్ ఛైర్మన్ నలుబోలు బలరామయ్యనాయుడులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోళ్ళ మేత ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపో తున్నాయని, ప్రభుత్వం రైతుల కష్టాలు పరిశీలించి, తిరిగి ఈ పరిశ్రమ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రైతులకు తగు చేయూతనందించాలని వారు కోరుతున్నారు. ఒక్క మన జిల్లాలోనే కాక, రాష్ట్రవ్యాప్తంగా కోళ్ళ పరిశ్రమ సంక్షోభంలోనే వుందని, కోళ్ళ రైతులను ఇతోధికంగా ఆదుకుంటే తప్ప ఈ పరిస్థితి నుంచి బయటపడలేమని వారు పేర్కొంటున్నారు. ఇదిలావుంటే, రాష్ట్రంలో సుమారు పాతికవేలమంది దాకా కోళ్ళ పరిశ్రమ జీవనాధారంగా వున్న రైతులు వున్నారని, రాష్ట్రంలో సంక్షోభంలో వున్న ఈ కోళ్ళ పరిశ్రమను ఎలాగైనా గట్టెక్కించాలంటూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ సమాఖ్యవారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలసి విన్నవించారు కూడా. కోళ్ళ పెంపకం దారుల కష్టాలను వారు ముఖ్యమంత్రి వద్ద ఏకరువు పెట్టారు. కోళ్ళ పరిశ్రమకు వ్యవసాయ హోదా కల్పించాలని, ఈ రంగానికి ఇచ్చే విద్యుత్‌కు పరిశ్రమల రంగానికి ఇచ్చే టారిఫ్ కాకుండా, వ్యవసాయ టారిఫ్‌ను అమలు చేయాలని



వారు విజ్ఞప్తి చేశారు. వాస్తవానికి కోళ్ళ పరిశ్రమను వ్యవసాయంగా గుర్తించి తగు వెసులుబాట్లు కల్పించాలని కోళ్ళ రైతులు ఎంతోకాలం నుంచి కోరుతూనే వున్నారు కూడా. విద్యుత్ ఛార్జీల్లో కొంత రాయితీ ఇవ్వగలిగితే కోళ్ళ రైతులకు కొంతమేరకు వెసులుబాటు కల్పించినట్లవుతుందని వారు కోరుకుంటున్నారు. అదేవిధంగా, విపరీతంగా పెరిగిన కోళ్ళమేత ధరలను, కోళ్ళ ఫారాల నిర్వహణావ్యయాన్ని దృష్టిలో పెట్టుకుని, కోళ్ళ ఫారాలకు అవసరమైన మేతను, గిడ్డంగుల్లో వున్న ధాన్యం, నూకలను సరసమైన ధరలకు ఇచ్చే ఏర్పాటుచేస్తే కోళ్ళ పరిశ్రమ తిరిగి నిలదొక్కుకుంటుందని కూడా వారు ముఖ్యమంత్రికి విన్నవించారు. ఆశించిన ధరలు లేకపోవడం, మేత ధరలు మాత్రం బాగా పెరుగుతుండడం కోళ్ళ పరిశ్రమను మరింత కష్టాలపాలు చేస్తోందని, కనుక ప్రభుత్వం ఈ విషయాలన్నిటినీ పరిశీలించి కోళ్ళ రైతులను ఆదుకునేందుకు తగు చొరవ తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. కొత్త ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సమస్యలన్నీ పరిశీలించి కోళ్ళ పరిశ్రమకు తగు చేయూతనందిస్తారని వారు ఆశతో ఎదురు చూస్తున్నారు. వారి ఆశలు నెరవేరుతాయని ఆశిద్దాం!...

## టీడీపీలోకి జంప్ చేసిన కావలి కీలక నేతలు

రాజకీయం రకరకాల రంగులు పులుముకుంటోంది. సమయానుకూలంగా రాజకీయ నాయకులు ఏ ఎండకా గొడుగును ఉపయోగిస్తారు. నెల్లూరులో ఈ నెల 1న రాష్ట్ర మున్సిపల్, పట్టణశాఖ మంత్రి నారాయణ నేతృత్వంలో కావలి కాంగ్రెస్ నాయకులు అమరా వెంకటసుబ్బారావు, అమరా వెంకట సుబ్బరాయుడు గుప్తాలు తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. తొలుత టీడీపీలోనే వుండిన అమరా సోదరులు 2005మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌లో చేరి పోటీచేసి గెలిచారు. ఇటీవల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌పార్టీ నుంచే పోటీ చేసిన వెంకట సుబ్బరాయుడు గుప్తా, ఆయన భార్య విజయలక్ష్మిలు గెలుపొందారు. కాని ప్రస్తుతం అధికారపార్టీగా వున్న టీడీపీలోకి జంప్ చేసారు. కావలి మున్సిపాల్టీని చేజిక్కించుకునేందుకు బీద సోదరులు మొదలుపెట్టిన ప్రయత్నాల్లో ఇదీ ఒక అంశంగా చెప్పుకోవచ్చు. వీరితో పాటు కొంతమంది నేతలు, కార్యకర్తలు తెలుగుదేశంపార్టీలో చేరారు.

## ఇసుక రీచ్‌లకు...
## వేలంపాటలు నిర్వహించాలి

**- కలెక్టర్‌కు బీజేపీ నాయకుని వినతి**

జిల్లాలోని 8 ఇసుక రీచ్‌లకు ప్రభుత్వం వెంటనే వేలంపాటలు నిర్వహించాలని, ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిడతల రమేష్ జిల్లా కలెక్టర్‌కు ఫ్యాక్స్ ద్వారా విన్నవించారు. ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తీసుకుని వెళ్లేందుకు కాలపరిమితి ముగిసిందని, దీంతో అధికారికంగా ఇసుక అందుబాటులో లేక అధిక ధరలకు కొనుగోలు చేయాల్సివస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా జిల్లాలో యధేచ్ఛగా జరిగిపోతూనే వుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక వేలంపాటలు నిర్వహించకపోవడంతో జిల్లాలోని వేలాదిమంది అసంఘటిత కార్మికులకు పనులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆ ఫ్యాక్స్‌లో వివరించినట్లు తెలియజేశారు. జిల్లాలోని ఇసుక ఇతర రాష్ట్రాలకు కూడా తరలిపోతోందని, ఇక్కడి ప్రజలు మాత్రం ఇసుక దొరక్క అసవ్తలు పడుతున్నారని, కలెక్టర్ వెంటనే ఈ విషయాలపై దృష్టి సారించి ఇసుక వేలంపాటల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## టిడిపి గూటికి
## కావలి కౌన్సిలర్

కావలి మునిసిపాల్టీలోని 18వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ సానం అనూష తెలుగుదేశం పార్టీలో చేరారు. మంగళవారం ఆమె నెల్లూరుకు వచ్చి అల్లీపురంలోని టిడిపి నేత సోమిరెడ్డి నివాసంలో, రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డిల సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. మంత్రి నారాయణ పార్టీ కండువాను కప్పి ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కంభం విజయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

నెల్లూరు ఆర్టీసీ బస్టాండు దగ్గరగల రోటరీ ఆడిటోరియంలో జూన్ 28న రోటరీక్లబ్, నెల్లూరు 2014–15సంవత్సరానికి ఎన్నికైన నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. అధ్యక్షుడిగా కె.వెంకటసుబ్రహ్మణ్యం, కార్యదర్శిగా విజయరామరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.ప్రతాప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.వెంకటేశ్వరరెడ్డి, కోశాధికారిగా వి.శ్రీనివాసులు, సార్జంట్ ఎట్ ఆర్మీస్‌గా ఎన్.నారాయణ, కార్యవర్గసభ్యులుగా పి.వెంకటేశ్వర్లు, కొండా శేఖర్‌రెడ్డి, ఎస్.రాఘవేంద్రషెట్టి, డాక్టర్ మహ్మద్‌మస్తాక్ అహ్మద్, కె.దయానంద్ ప్రమాణస్వీకారం చేసారు. ఈ సందర్భంగా రోటరీసభ్యులు టి.నారాయణ, జయరామరాజులు వికలాంగునికి ట్రైసైకిల్, ఏడవతరగతి చదువుతున్న ఒక విద్యార్థికి రూ.1000/- వితరణ చేసారు.

పల్స్‌పోలియో కార్యక్రమంలో సేవలందించిన చంద్రారెడ్డి డిగ్రీ కళాశాల రోటరేక్టర్స్‌కు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో విఎస్‌యూ రిజిస్ట్రార్ కె.నాగేంద్రప్రసాద్, పి.డి.జి ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ బి.సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భౌతికదాడులకు పాల్పడవద్దు

**- విద్యుత్ ఇంజనీర్ల సంఘం**

విద్యుత్ కొరతకు ఇంజనీర్లు, సిబ్బంది కారణం కాదని, వారిపై కొన్ని ప్రాంతాల్లో దాడులు చేయడాన్ని జూన్ 29న విద్యుత్ శాఖ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్లొమా ఇంజనీర్ల సంఘాల నాయకులు కె.పరంధామయ్య, ఎం.కృష్ణారెడ్డి, దామోదర్‌రెడ్డిలు ఖండించారు. విద్యుత్ కోతకు ఇంజనీర్లు, సిబ్బందే కారణమని భావించి క్షణికావేశంతో వినియోగదారులు భౌతికదాడులకు పాల్పడుతున్నారని, దీని వల్ల సబ్‌స్టేషన్‌లలో సిబ్బంది విధులు నిర్వర్తించడానికే జంకుతున్నారన్నారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు మరింత అంతరాయం ఏర్పడడం తప్పించి సమస్య పరిష్కారం కాదని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ కొరతను అధిగమించడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, త్వరలో సమస్య పరిష్కారం కాగలదని, ఈలోపు వినియోగదారులు సంయమనంతో వ్యవహరించాలని వారు కోరారు.

## ఎన్జీఓ హోంలో సమైక్యాంధ్ర మీటింగ్ హాలు

నెల్లూరు ఎన్జీఓ హోంలో రాంగోపాల్ ఏసి ఫంక్షన్ హాలు, సమైక్యాంధ్ర మీటింగ్ డైనింగ్‌హాలును జూన్ 29న రాష్ట్ర ఎన్జీఓల సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా లబ్దిదారులకు చేరాల్సిన ప్రతి పైసా వారికి అందేలా ఉద్యోగులు కృషి చేయాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కాలపరిమితిని డిసెంబరు వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఉద్యోగులకు పిఆర్‌సి త్వరగా అమలు పరచాలని, హెల్త్‌కార్డులు, హెల్త్‌స్కీములలో లోపాలను సరిదిద్ది ఆగష్టు 15కి అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కార్యక్రమంలో ఎన్జీఓ సంఘం సహఅధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, వెంకటేశ్వరరెడ్డి, కార్యనిర్వాహకకార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కుకు దరఖాస్తులు

జిల్లాలో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోందని చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారులు తెలిపారు. 12వ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించి వుందని, పారిశ్రామిక సంఘాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఘాలు, స్పెషల్ పర్పస్ వెహికల్స్ నుంచి కేంద్రప్రభుత్వం ప్రతిపాదనలు కోరుతున్నదని తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమగ్ర ప్రాజెక్టు నివేదికలతో తమ దరఖాస్తులను ఆర్.కె.శ్రీవాస్తవ, టెక్స్‌టైల్‌పార్కు కార్యదర్శి, చేనేత జౌళి మంత్రిత్వశాఖ, 339–బి, ఉద్యోగభవన్, న్యూఢిల్లీ చిరునామాకు జూలై 7వ తేదీ 5.00గంటల లోపు దరఖాస్తులను పంపాలని కోరారు.

ప్రాజెక్టు పూర్తి వివరాలను భారత జౌళిశాఖ వెబ్‌సైట్ www.texmin.nic.inలో చూసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

## రామతీర్థం ఆలయ హుండీ లెక్కింపు

హరహరమహాదేవ శంభో శంకరుని లింగరూపానికి సాక్షాత్తు ఆ శ్రీరామచంద్రుడే పూజలు చేసిన క్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన విడవలూరు మండలంలోని రామతీర్థంలోని శ్రీకామాక్షిదేవి సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఇటీవల వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా దేవాలయంలోని హుండీ లెక్కింపు జరుపగా రూ.6,59,629 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఏ.వేణుగోపాల్ తెలిపారు. టెంకాయలు, పూజాసామగ్రి అమ్మకం ద్వారా రూ.1,08,500, టిక్కెట్ల ద్వారా రూ. 70,700, తాత్కాలిక అంగళ్ళ ద్వారా రూ. 1,83,500, కల్యాణం చదివింపుల ద్వారా రూ.51,105, టెంకాయచిప్పల ద్వారా రూ.20,500, హుండీ ద్వారా రూ.2,01,814, వివాహకట్నాల ద్వారా రూ.3,500 వచ్చినట్టు తెలిపారు. లెక్కింపులో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.రమణ, తుమ్మగుంట దేవస్థాన ఈఓ మల్లికార్జునరెడ్డి, జడ్పీటీసీ చిమటా రమాదేవి, సర్పంచ్ చిమటా వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ దాసరి అరుణ, సన్యాసిరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జేసీకి సీఎం అభినందన



చెన్నైలోని పోరూర్‌లో నిర్మాణంలో ఉన్న 11అంతస్థుల భవనం కుప్పకూలిన ఘటనలో బాధితులకు సేవలందిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖారాణిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. భవనం కూలిన సంగతి తెలియగానే జేసీ రేఖారాణి ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ వైద్యులు, సిబ్బంది, అధికారులతో కూడిన బృందం చెన్నైకు వెళ్లింది. ఈ ఘటనలో చాలామంది తెలుగువాళ్లున్నారు. క్షతగాత్రులను కాపాడడంతో పాటు మృతదేహాలను స్వగ్రామాలకు పంపడానికి ఈ బృందం విశేషకృషి చేసింది. సోమవారం షార్‌లో రాకెట్ ప్రయోగానంతరం చంద్రబాబు చెన్నైలోని సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఇక్కడ ప్రమాదం వివరాలను జేసీ రేఖారాణి ద్వారా తెలుసుకున్నారు. క్షతగాత్రులకు రేఖారాణి బృందం చేస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు.

## నారాయణ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయ అవార్డు

ముంబయిలో జూన్22న జరిగిన ఇన్‌స్టిట్యూషన్ ఇండస్ట్రియల్-2014 కాన్ఫరెన్స్‌లో నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల జాతీయ స్థాయి అవార్డు పొందిందని నారాయణ కళాశాలల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉత్తమ ఇండస్ట్రియల్ రిలేషన్‌షిప్ అవార్డు వచ్చిందని ఇది తమ కళాశాలకు గర్వకారణమని పేర్కొన్నారు.

## వైద్యకళాశాలలో ప్రవేశాలు కల్పించండి

—ఎన్ఎస్‌యుఐ

నూతనంగా తయారవుతున్న ప్రభుత్వ వైద్యకళాశాలలో ఈ సంవత్సరమే ప్రవేశాలు మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ నెల్లూరు విఆర్‌సి కూడలిలో జూన్ 28న ఎన్ఎస్‌యుఐ కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ నేత అంజయ్య మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులు ఎందరో ఈ వైద్యకళాశాలలో ప్రవేశం కోసం ఎదురుచూస్తున్నారని, ఓ ప్రతినిధి దీనికి కాలడ్డుతున్నాడని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించేలా కార్యాచరణ చేపట్టాలని అన్నారు.

## టీవీలకు సెట్‌టాప్‌బాక్సులు అమర్చుకోండి

ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీలోపు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఇళ్ళల్లోని టీవీలకు సెట్‌టాప్‌బాక్స్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఆక్ట్(ఏసిటీ) టెలివిజన్ ప్రైవేట్ లిమిటెడ్ హెడ్‌ఆఫ్ ఆపరేషన్స్ బి.వెంకటసుబ్బారావు తెలిపారు. జూన్ 29న నెల్లూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31వతేదీ గ్రామీణప్రాంతాలకు చివరిగడువుగా తెలిపారు. 65శాతం మంది ఇప్పటికే సెట్‌టాప్ బాక్సులు ఏర్పాటు చేసుకున్నారని, వారంతా నాణ్యతకలిగిన ప్రసారాలను తిలకిస్తున్నారని, మిగిలివారు కూడా త్వరపడితే మంచిదని పేర్కొన్నారు.

### గెజిటెడ్ హోదా పొందిన

## ఎన్జీఓ నేత రవీంద్రబాబు

20ఏళ్ళుగా బాధ్యతలు నిర్వహించిన ఎన్జీఓ అసోసియేషన్ నాయకుడు రవీంద్రబాబు జూన్ 29న అధ్యక్షపదవికి రాజీనామా చేసారు. ఈ సందర్భంగా నెల్లూరు ఎన్జీఓ హోంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర ఎన్జీఓ సంఘం అధ్యక్షుడు పి.అశోక్‌బాబు పాల్గొని మాట్లాడుతూ రవీంద్రబాబు గెజిటెడ్ హోదా పొందడంతో జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసారని, ఆయన గత 20సంవత్సరాలుగా అసోసియేషన్‌కు విశిష్టరీతిలో సేవలందించారని పేర్కొన్నారు. తదుపరి ఆయనతో పాటు సేవలందించిన నేతలను రవీంద్రబాబుతో పాటు ఘనంగా సత్కరించారు.

# నెల్లూరు కబుర్లు



## జిల్లాలో వివిపిల సందడి

ఈ వారంలో దేశ, రాష్ట్ర ప్రముఖులు చాలామంది నెల్లూరు జిల్లాలో అడుగుపెట్టారు. జూన్ 29వ తేదీన శ్రీహరికోటలోని షార్‌సెంటర్‌కు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చారు. ఆయనతో పాటు కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, పీయుష్‌గోయెల్, జితేంద్రప్రసాద్, రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణలు షార్‌కు చేరుకున్నారు. 30వ తేదీ షార్ నుండి జరిగిన పిఎస్ఎల్‌వి-సి23 ప్రయోగాన్ని వీరంతా తిలకించి, ఎవరి ఊర్లకు వాళ్లు వెళ్లిపోయారు.

మున్సిపల్ మంత్రి నారాయణ మాత్రం 30వ తేదీ నెల్లూరొచ్చారు. మేయర్, జడ్పీ ఛైర్మెన్, ఎంపీపీల ఎన్నికలు ఉండడంతో జిల్లా పార్టీ నాయకులతో వాటిపై సమాలోచనలు జరిపారు.

## నారాయణకు అపూర్వస్వాగతం



సోమవారం జిల్లాకు తొలిసారిగా విచ్చేసిన రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణకు నెల్లూరులో ఘనస్వాగతం లభించింది. ఆయన రాక సందర్భంగా తెలుగుదేశం కార్యకర్తలు భారీఎత్తున బాణాసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు.

షార్ నుండి నారాయణ నేరుగా నెల్లూరుకు వచ్చారు. పార్టీ కార్యాలయం వద్ద సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడు, పరసా రత్నం, అనూరాధ, అంచల వాణి వంటి నాయకులు మధ్యాహ్నం ఒంటిగంట నుండే వేచి చూసారు. నారాయణ విద్యా, వైద్య సంస్థల సిబ్బంది కూడా భారీఎత్తున తెలుగుదేశంపార్టీ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. మధ్యాహ్నం 2.30గంటలకు పార్టీ కార్యాలయం వద్దకు వచ్చిన నారాయణకు నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. మంత్రికి మహిళా నాయకులు దిష్టితీసి మంగళహారతులతో స్వాగతం పలికారు. నారాయణ తొలుత అక్కడే ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి దండేసి దండం పెట్టుకున్నారు. మంత్రిగా నారాయణ రాకతో పార్టీ కార్యాలయంలో సందడి నెలకొంది.

### నెల్లూరు వైద్యకళాశాలకు

## ప్రిన్సిపాల్

నెల్లూరులోని ప్రభుత్వ ప్రధానాసుపత్రి ప్రాంగణంలో నిర్మాణంలో వున్న ప్రభుత్వ వైద్యకళాశాలకు పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ప్రభాకర్‌రావును నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీచేసారు. ప్రభాకర్‌రావు ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ వైద్యకళాశాలలో ఫోరెన్సిక్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## పెరిగిన విజయ పాల ధర

విజయ డెయిరీ పాలధరలు పెరిగాయి. అలాగే రైతుల నుండి సేకరిస్తున్న పాల ధరను కూడా పెంచారు. ఈమేరకు డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ఒక ప్రకటన విడుదల చేసారు. ఇప్పటివరకు రైతుల నుండి సేకరించే పదిశాతం వెన్నగల పాలధర లీటర్ 50.90 రూపాయలుండగా దానిని 52.90రూపాయలకు పెంచారు. గేదెపాలలో కేజీ వెన్న 510రూపాయలుండగా దానిని 530 రూపాయలు చేసారు. ఆవు పాలలో కేజీ వెన్న 205రూపాయలుండగా దానిని 215రూపాయలు చేసారు. అలాగే వినియోగదారుడు కొనేపాలపై రవాణా, ప్రాసెసింగ్‌ఛార్జీల పేరుతో ఏకబిగిన లీటరుకు 4రూపాయలు పెంచారు.

## ప్రారంభమైన రంజాన్ దీక్షలు

రంజాన్ ఉపవాసదీక్షలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయి. నెల్లూరులోని అన్ని మసీదుల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ముస్లిం సోదరులు తెల్లవారుజాము నుండి ఉపవాసదీక్షలు పాటిస్తూ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు.

## రోడ్డుపై కరెంట్

జూన్ 28వ తేదీన నెల్లూరులోని ఆచారివీధిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల రోడ్డుపైనే షాక్ తగల సాగింది. ఆరోజు ఉదయం వర్షం పడడంతో రోడ్డంతా చిత్తడిగా మారింది. ఆ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుండి షార్ట్ సర్క్యూట్ కావడంతో రోడ్డంతా విద్యుత్ ప్రవహించసాగింది. అప్పుడే అటుగా నడిచి వచ్చిన ఆవు విద్యుత్‌ఘాతానికి గురై మరణించింది. దీన్ని గమనించిన స్థానికులు అటు వైపు ఎవరినీ వెళ్లనీయకుండా కాపలా ఉండి విద్యుత్ అధికారులకు సమాచారమిచ్చారు. వాళ్లొచ్చి బాగుచేసి వెళ్లడంతో రాకపోకలు యథావిధిగా సాగాయి.

## నాద నీరాజనం ఎంపికలు


టీటీడీ, హిందూ ధర్మ ప్రచారపరిషత్, ఎస్వీ భక్తి ఛానెల్ సంయుక్త ఆధ్వర్యంలో తిరుమలలో ప్రతిరోజూ నిర్వహించే నాద నీరాజనానికి కళాకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ధర్మప్రచార పరిషత్ అధ్యక్షులు సి.వి.సుబ్రహ్మణ్యం, కో-ఆర్డినేటర్ యం.శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6న ఎంపికలు నిర్వహిస్తాం, కళాకారుల వయసు 14 నుండి 65ఏళ్ల లోపు ఉండాలి. సంగీత నృత్యాలలో విశేషప్రతిభ కలిగి ఉండాలి. ప్రభుత్వ, ఇతర ప్రసిద్ధ సంస్థల నుండి విశిష్టపురస్కారాలు పొందిన వారు, ఆకాశవాణి ద్వారా శాస్త్రీయ సంగీతంలో బిగ్రేడ్ గుర్తింపు పొందిన కళాకారులు కూడా ఈ ఎంపికలలో పాల్గొన వచ్చని వారు తెలిపారు.

## రక్తదానం మహాదానం



నెల్లూరు ఎకెనగర్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని యంజి బ్రదర్స్ ఆటోమొబైల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జూన్ 27న రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జరిగిన సభకు యంజిబ్రదర్స్ యండి యం.ఆర్.గంగాధర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా జిల్లా అదనపు సంయుక్త కలెక్టర్ రాజ్‌కుమార్, రెడ్‌క్రాస్ మాజీ కార్యదర్శి డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం, యం.జి. ఇండస్ట్రీస్ అధినేత యం.జి.రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరాన్ని జిల్లా అదనపు సంయుక్తకలెక్టర్ రాజ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు నిర్వహించడం మంచి పని అని, ఒకరు ఇచ్చే రక్తం ముగ్గురి ప్రాణాలు కాపాడుతుందని అన్నారు. రెడ్‌క్రాస్ మాజీకార్యదర్శి డా॥ ఎ.వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ 18ఏళ్ళు నిండిన ప్రతి ఆరోగ్యవంతుడు రక్తదానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తం ఇవ్వడం ద్వారా తిరిగి పరిశుభ్రమైన రక్తం జనిస్తుందని అన్నారు. శిబిరంలో దాదాపు 85మంది రక్తదానం చేసారు.



ఈ నెల 2న నెల్లూరు వైయస్ఆర్ నగర్‌లో నిర్మిస్తున్న హౌసింగ్‌కాలనీ వివరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్

# అన్‌లోడింగ్‌లో కృష్ణపట్నంపోర్టు రికార్డు



కృష్ణపట్నం పోర్టులో లంగరు వేసిన లిబియా నౌక

జిల్లాలోని కృష్ణపట్నం ఓడరేవు ఎగుమతులు, దిగుమతులలో దూసుకుపోతోంది. ముఖ్యంగా విదేశాల నుండి వచ్చిన నౌకల నుండి సరుకును అతితక్కువ సమయంలో అన్‌లోడింగ్ చేస్తూ రికార్డు సృష్టిస్తున్నారు. లిబియా నుండి కృష్ణపట్నంపోర్టుకు 1,89,555 టన్నుల బొగ్గుతో భారీ నౌక ఒకటి వచ్చింది. ఓడ నుండి బొగ్గును అతితక్కువ సమయంలో అన్‌లోడింగ్ చేసారు. ఈ ఏడాది జూన్‌లో 3వేల మిలియన్‌ల మెట్రిక్‌టన్నుల సరుకును ఎగుమతి, దిగుమతి చేసినట్లు పోర్టు సిఇఓ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విస్తృతమైన రైల్వే నెట్‌వర్క్ కలిగిన ఈ ఓడరేవు నుండి సరుకులను ఎప్పటికప్పుడు వివిధ ప్రాంతాలకు చేరుస్తున్నాయన్నారు. ఆధునిక బెర్త్‌లు, కంటైనర్ సదుపాయం కలిగిన ఈ ఓడరేవు సరుకు రవాణాలో రికార్డు సృష్టిస్తుందన్నారు. 2013-14లో ఈ పోర్టుకు భారీ ఓడలు 47రాగా 2014-15లో మొదటి మూడు నెలల్లోనే 19భారీ నౌకలు వచ్చాయని ఆయన పేర్కొన్నారు.

# శివుడే దేవాధిదేవుడు - ఆదిదేవుడు - పరమపురుషుడు


'శివుడే దేవాధి దేవుడు - ఆదిదేవుడు - పరమపురుషుడు' గ్రంథాల్ని పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు, మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో జూన్ 29న శివశక్తి షిరిడీసాయి అనుగ్రహ మహాపీఠాధిపతి శ్రీ రమణానందమహర్షి రచించిన "శివుడే దేవాధిదేవుడు - ఆదిదేవుడు - పరమపురుషుడు' గ్రంథం ప్రతులను ఉచితంగా భక్తులకు పంపిణీ చేసారు. కార్యక్రమంలో నెల్లూరు నగర శాసనసభ్యులు డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొని మాట్లాడుతూ భక్తులు గ్రంథంలోని అంశాలను చదివి ఆచరించాలని పేర్కొన్నారు. ధర్మబద్ధంగా జీవనం సాగించి దైవానుగ్రహం పొందాలని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్యకార్య నిర్వాహాధికారి కె.జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా ఈ గ్రంథం ప్రతులను సిఎఎం స్కూలు దగ్గరగల ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో దర్గామిట్టలోని రాజరాజేశ్వరి ఆలయంలో దేవస్థాన ముఖ్యకార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు నేతృత్వంలో, నవాబుపేటలోని శ్రీ మల్లేశ్వరాలయం మొదలగు శివాలయాల్లో ఉచితంగా భక్తులకు పంచిపెట్టారు.

# ముగిసిన మద్యంషాపుల డ్రా జాతర


కస్తూర్బా కళాక్షేత్రం ముందు మద్యంవ్యాపారుల సందడి

మద్యం దుకాణాల లైసెన్స్‌ల కేటాయింపునకు సంబంధించి లక్కీడ్రా తతంగం జూన్ 28న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో నిర్వహించారు. ఆ ముందురోజు రాత్రి వరకు కూడా నెల్లూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో మద్యం వ్యాపారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలో 348మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోరగా 21దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం విశేషం. మిగిలిన 327షాపులకు గాను 3988దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1476దరఖాస్తులు మహిళల పేరుతో రావడం విశేషం. ఒక్కో దరఖాస్తుకు 25వేల రూపాయలు డిడి ఇచ్చారు. ఈ నగదును తిరిగి చెల్లించరు. డ్రాలో షాపులు రానివాళ్లు కట్టిన ధరావత్తును మాత్రం తిరిగి చెల్లిస్తారు. 28వ తేదీ తెల్లారే దాకా డ్రా నిర్వహణ జరిగింది. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమీషనర్ చైతన్య మురళి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో డ్రాను నిర్వహించారు. జిల్లాలో ఆదాయం బాగా వస్తుందని పేరున్న షాపులకు మాత్రం దరఖాస్తులు భారీగా పడ్డాయి. నెల్లూరులోని జేమ్స్‌గార్డెన్ షాపుకు 106, కొత్తకాలువ సెంటర్ షాపుకు 109, శెట్టిగుంటరోడ్డులోని షాపుకు 83, వెంకటాచలం షాపుకు 74, కొత్తూరు షాపుకు 73 దరఖాస్తులు వచ్చాయి. బాగా తాగి ఎక్సైజ్‌కు ఆదాయం పెంచుతారనే పేరున్న ఆయా గ్రామాలలోని షాపులకు కూడా పెద్దసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. చాలా గ్రామాలలో షాపులకు మాత్రం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు వేసారు. డ్రాలో పేర్లు వచ్చిన వ్యాపారులు ఎగిరి గంతేయగా, ఆల్‌రెడీ షాపులు పెట్టుకుని ఉండి ఈసారి లాటరీలో పేర్లు రానివాళ్లు మాత్రం తమ ప్రాంతంలో వచ్చిన షాపును ఎక్కువ రేటు పెట్టి కొనేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

# సింహపురి సమాచారం

# అభివృద్ధి ఖిల్లాగా నెల్లూరుజిల్లా

**- మంత్రి పి.నారాయణ**



రాష్ట్ర మున్సిపల్ మరియు పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక పి.నారాయణ సోమవారం తొలిసారిగా నెల్లూరొచ్చారు. మంత్రి హోదాలో మొదటి సారి జిల్లాలో అడుగుపెట్టిన నారాయణకు జిల్లా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, నారాయణ శిష్యులు ఘనస్వాగతం పలికారు. నెల్లూరులోని తెలుగుదేశంపార్టీ జిల్లా కార్యాలయంలోనూ సోమవారం ఆయన తొలిసారే అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరును పారిశ్రామిక రాజధానిగా మలిచేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. పారిశ్రామిక రంగంలో నెల్లూరుజిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందన్నారు. నెల్లూరును స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. అన్ని ముఖ్యపట్టణాలలో మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ విద్యాసంస్థలను తొలిదశలో విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతిలలో నిర్మించడం జరుగుతుంది. తర్వాత దశలో సీమాంధ్రలోని 13జిల్లాలకు వీటిని విస్తరింపజేస్తామన్నారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు కోస్టల్‌కారిడార్ నిర్మిస్తామని, అలాగే చెన్నై - బెంగుళూరు కారిడార్‌లో నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాలు కూడా ఉంటాయని చెప్పారు. ఈ పారిశ్రామిక కారిడార్‌లతో అన్ని జిల్లాలలోనూ వేగవంతమైన అభివృద్ధి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర విభజన వల్ల రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని, ప్రస్తుతం రాష్ట్రం 17వేల కోట్ల ఆర్థిక లోటుతో ఉందన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదని, విద్యుత్, నీళ్ల కొరత తీవ్రంగా వుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఋణమాఫీ హామీని చిత్తశుద్ధితో అమలు చేయడానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల వారికి సమదూరంలో ఉండేలా రాజధానిని గుంటూరు, విజయవాడ మధ్యే ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ఈ సమావేశంలో ఎంపీ కంభంపాటి రామ్మోహన్‌రావు, మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పరసారత్నం, తెలుగుదేశం నాయకులు డాక్టర్ జెడ్.శివప్రసాద్, కిలారి వెంకటస్వామినాయుడు, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, అనూరాధ, అంచల వాణి, నూనె మల్లికార్జునయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సేవాభావమే 'లయన్స్' లక్ష్యం

## లయన్స్‌క్లబ్ కొత్త కార్యవర్గ ప్రమాణస్వీకారం



క్లబ్ మాజీగవర్నర్ పి.చంద్రన్‌ను సత్కరిస్తున్న అధ్యక్షకార్యదర్శులు కృష్ణమోహన్, సురేష్‌కుమార్

సమాజంతో కలిసి సేవాజీవనాన్ని సాగించడమే లయన్స్‌క్లబ్ లక్ష్యమని ఆ క్లబ్ మాజీ గవర్నర్ పోకల చందర్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని పరమేశ్వరీ, మహేశ్వరి కల్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం జరిగింది. క్లబ్ 2014-15 అధ్యక్షుడిగా ఎం.వి.ఎస్.కృష్ణమోహన్, కార్యదర్శిగా ఇమ్మడిశెట్టి సురేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా పి.శ్రీరాములు, శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్లు, సంయుక్తకార్యదర్శిగా కె.ప్రవీణ్‌శంకర్, కోశాధికారిగా టి.సహజానందరెడ్డి, సంయుక్త కోశాధికారిగా హజరత్‌బాబు, టైల్‌ట్విస్టర్‌గా సురేష్‌బాబు, లయన్ టామరర్‌గా రమేష్‌కుమార్, పి.జైన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు సేవాప్రియ అధ్యక్షురాలిగా సుష్మాకిరణ్, కార్యదర్శిగా వి.భవానికుమారి, కోశాధికారిగా కె.వెంకట నాగలక్ష్మిలు ప్రమాణస్వీకారం చేసారు. మాజీగవర్నర్ చందర్ ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఛలోక్తులు, హాస్యదాయకమైన ప్రసంగం మధ్య ఉల్లాసంగా నడిపించారు. ఈ సందర్భంగా తన ప్రసంగంలో ఆయన నెల్లూరు నేల విశిష్టతను కొనియాడుతూ, లయన్స్ సభ్యుల సేవా మార్గాన్ని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ఇంకా కృష్ణపట్నంపోర్టు సిఇఓ వై.అనిల్, కమర్షియల్ టాక్స్ డిప్యూటీ కమీషనర్ రాజశేఖర్‌లు కూడా పాల్గొని తమ సందేశాన్నందించారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# కలుషితరక్తం తొలగింపు

రెడ్‌క్రాస్ రక్తనిధిలో జూన్30న డిస్‌కార్డ్ కమిటీ ఆధ్వర్యంలో కలుషిత రక్తాన్ని తొలగించారు. ఈ సందర్భంగా రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాల్లో సేకరించిన రక్తాన్ని పరీక్షించి కలుషిత రక్తాన్ని వేరు చేశామని, దాదాపు 19యూనిట్ల కలుషిత రక్తాన్ని బయోహజార్డ్ కంపెనీకి అందించామన్నారు. జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్‌ల పర్యవేక్షణలో జరుగుతున్న రక్తనిధి సేవల్లో భాగంగా కలుషిత రక్తాన్ని తొలగించడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు డాక్టర్ పెంచలసుబ్బయ్య, చీఫ్‌టెక్నాలజిస్ట్ జీవన్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసరావు, రక్తనిధి సిబ్బంది శశిధర్ పాల్గొన్నారు.



శ్రీను గల్పిక

# నెల్లూరులో నరేంద్ర మోడీ షికారు

అది శ్రీహరికోటలోని షార్ సెంటర్. అక్కడ ఓ హెలీపాడ్‌కు సమీపంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు యం.వెంకయ్యానాయుడు, జితేంద్ర ప్రసాద్, ముదురుదోమలశాఖ మంత్రి పి.నారాయణ, ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్, ఎంపీలు కంభంపాటి రామ్మోహన్‌రావు, తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు, బీద మస్తాన్‌రావు వంటి నాయకులున్నారు. అక్కడున్న కేంద్రమంత్రులతో పాటు ఇస్రో శాస్త్రవేత్తలు కూడా చంద్రబాబు, ఆయన పార్టీ నేతల వైపు విచిత్రంగా చూడసాగారు. అంతలో ఆకాశంలో హెలికాప్టర్ వస్తున్న సౌండ్ వినిపించింది. నాయకులంతా అలర్ట్ అయ్యారు. హెలికాప్టర్ ల్యాండ్ అయ్యింది. అందులో నుండి ప్రధాని నరేంద్ర మోడీ దిగారు. మొదట గవర్నర్ నరసింహన్ ఆయనకు పూలగుత్తి ఇచ్చి స్వాగతం పలికారు. ప్రధాని తర్వాత ఇస్రో శాస్త్రవేత్తలను పలుకరించుకుంటూ వచ్చి చంద్రబాబు, ఆయన బ్యాచ్ వద్దకు వచ్చి ఆగిపోయారు. మోడీ కూడా వాళ్ల వైపు విచిత్రంగా చూడసాగాడు. కారణం వాళ్లందరూ వేసుకున్న చొక్కాలకు, ఫ్యాంట్లకు బొక్కలున్నాయి. వాటిలో కొన్నింటికి అక్కడక్కడా అతుకులు కూడా వేసి ఉన్నాయి. మోడీ వారిని చూస్తూ... ఏంటి చంద్రబాబు... మీ చొక్కాలకు ఆ బొక్కలేంటి, ఆ అతుకులేంటి అని అడిగాడు. అందుకు బాబు... ఏం చేద్దాం సార్, మంచిచొక్కాలు కుట్టించుకోవడానికి మా వద్ద డబ్బులు లేవు. రాష్ట్ర విభజనతో మా పరిస్థితి ఇది. మీకు చొక్కా, ఫ్యాంట్‌లే కనిపిస్తున్నాయి. లోపల బనియన్, కట్‌డ్రాయర్‌ల పరిస్థితీ ఇంతేనన్నాడు. మీ దరిద్రం నాకు అర్థమైంది, ఇంత కళ్లకు కట్టినట్లు మీరు ప్రదర్శనిచ్చాక కూడా అర్థం కాకుండా ఉంటుందా? మిమ్మల్ని తప్పకుండా ఆదుకుంటాం... ఇకనుండి నా ముందు ఇలాంటి కన్నీటి కథాచిత్రాలు ప్రదర్శించవద్దని మోడీ వేడుకున్నాడు. మీరు ఆదుకుంటామంటే మేం ఈ చిరుగుల చొక్కాలు ఎందుకేసుకుంటామని చంద్రబాబు అన్నాడు. తర్వాత అందరూ అక్కడే ఏర్పాటు చేసిన బస్సుల్లో ఎక్కి పిఎస్‌ఎల్‌వి-సి23 రాకెట్‌ను అమర్చిన మొదటి లాంచ్‌ప్యాడ్ వద్దకు వెళ్లారు. అక్కడ మోడీ రాకెట్‌ను చూస్తూ... రాకెట్ ప్రయోగానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయా అని అడిగాడు. అక్కడేవున్న ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్ వెంటనే... అన్నీ ఏర్పాట్లు చేసేసాం సార్... తిరుమల శ్రీవారి సన్నిధిలో రాకెట్ నమూనాకు పూజలు జరిపించాం, సూళ్లూరుపేట చెంగాళమ్మ ఆశీస్సులు తీసుకున్నాం, వేద పండితులు పెట్టిన ముహూర్తంకే ప్రయోగం జరుపుతున్నామని చెప్పారు. ఏర్పాట్లంటే అవి కాదు... మోటార్లకు ఆయిల్ పట్టడం, మిషన్ చెక్ చేసుకోవడం వంటివని మోడీ అన్నాడు. దానికి రాధాకృష్ణన్... ఆ కార్యక్రమాలన్నీ కూడా పూర్తయ్యాయని చెప్పాడు. ఒక్కో ప్రయోగానికి ఎంతకాలం పడుతుందని మోడీ అడిగాడు. ఐదు నెలలకోసారి రాకెట్‌ను ప్రయోగిస్తున్నామని రాధాకృష్ణన్ చెప్పారు. అప్పుడు మోడీ... ఇంకా స్పీడ్ పెంచాలి, మీ పనిలో వేగం పెంచాలి, 5నెలలకోసారి కాదు, 5రోజులకోసారి రాకెట్ ప్రయోగం జరగాలి... ఆ విధంగా పనిచేయండంటూ ముందుకు కదిలాడు. ఆ మాటకు రాధాకృష్ణన్‌తో సహా ఇస్రో శాస్త్రవేత్తలందరూ నోర్లు తెరిచారు.

మోడీతో పాటు అందరూ భాస్కర అతిథిగృహం వద్దకు చేరుకున్నారు. మోడీ ఫ్రెష్ అయ్యాడు. ఆయనకు నిద్రపోవడానికి ఇంకా చాలా టైముందనిపించి వెంకయ్యానాయుడుతో... వెంకయ్యాజీ అలా వెహికల్‌లో నెల్లూరు దాకా వెళ్లొద్దామా అని అడిగాడు. నెల్లూరు అనగానే వెంకయ్య మనస్సు ఎగిరి గంతేసింది. ఎలాగూ సొంతంగా పోదామంటే కుదరడం లేదు, మోడీతో వెళితే సరిపోతుందనుకున్నాడు. కాని అక్కడే వున్న ఎస్పీ నవదీప్‌సింగ్ గ్రేవాల్ మాత్రం అందుకు ఒప్పుకోలేదు. సార్, ఈ సమయంలో అక్కడ సెక్యూరిటీ ప్రాబ్లం... పోవడానికి కుదరదు అని చెప్పాడు. అందుకు మోడీ... సెక్యూరిటీ ప్రాబ్లం ఏముంది, ఇంతమంది భద్రతా సిబ్బంది ఉన్నారు కదా, అని ప్రశ్నించాడు. దానికి ఎస్పీ... భద్రతా సిబ్బంది ఉన్నారు సర్, ఈ సమయంలో అక్కడ మున్సిపల్ సిబ్బంది ఉండరు అని అన్నాడు. మోడీకి అతని మాటలు అర్థంకాలేదు. మున్సిపల్ సిబ్బందితో పనేంటని మోడీ అడిగాడు. అప్పుడు నవదీప్... మనకు నెల్లూరులో భద్రతా దళాలు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే... అక్కడ ఎవరూ పొడిచేదేమీ ఉండదు. కాని నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలు కరిచాయంటే నెలరోజుల దాకా బెడ్‌మీద నుండి లేచే పరిస్థితి ఉండదు. మున్సిపల్ సిబ్బంది ఉంటే ఫాగింగ్ చేస్తూ మనకు రక్షణగా ఉంటారని చెప్పాడు. వెంటనే మంత్రి పి.నారాయణ... ఆ సంగతి నేను చూసుకుంటాలే అని చెప్పడంతో అందరూ రోడ్డు మార్గాన నెల్లూరుకు బయల్దేరారు. అలా బయల్దేరిన కాన్వాయ్ సూళ్లూరుపేట వద్ద హైవే ఎక్కింది. నాయుడుపేట దాటాక హైవే మధ్యలో డివైడర్‌పై గేదెలు గడ్డి మేస్తుండడాన్ని చూసి... ఇదేంటి పొలాల్లో మేయాల్సిన గేదెలు రోడ్డు మీద తింటున్నాయని మోడీ అడిగాడు. వెంకయ్య దానికి... ఇప్పుడు పొలాల్లో కంటే గడ్డి డివైడర్ల మీదే ఏపుగా పెరుగుతుంది, అందుకే పశువులు డివైడర్ల మీద వుంటే, వాటి మూలంగా రోడ్ల మీద పోవాల్సిన కార్లు, లారీలు పొలాల్లోకి దూసుకుపోతున్నాయని చెప్పాడు. వాళ్లు అలా మాట్లాడుకుంటుండగానే వెంకటాచలం టోల్‌గేట్ వద్దకు వచ్చాక... వెంకయ్య మనసు స్వర్ణభారత్ ట్రస్ట్ వైపుకు లాగసాగింది. చూసి చాలా కాలమైంది. ఇప్పుడు చూడాలనిపిస్తుంది అని మనసులో ఉబలాటం రేగింది. కరెక్ట్‌గా కారు స్వర్ణభారత్ ట్రస్ట్ సమీపంలోకి రాగానే... సార్, ఇదే మన ట్రస్ట్ అని మోడీకి చూపించాడు. మోడీ అది చూసి.. ఇంతకుముందు నేనొచ్చాను కదా, మంచి ట్రస్ట్, మంచి పనులు చేస్తున్నారని చెప్పాడు. ఓ పది నిముషాల తర్వాత నెల్లూరులోకి ప్రవేశించారు. మోడీ కారు నగరంలో కూడా వందకిలోమీటర్లతో పోతుంది. అప్పుడే వీరి కారును ఓ ఆటో, దానిని ఓటౌన్‌బస్సు క్రాస్ చేసుకుంటూ దూసుకుపోయాయి. అది చూసి మోడీ, అతని కారు డ్రైవర్ షాక్‌కు గురయ్యారు. కాని వెంకయ్య నాయుడు మాత్రం నింపాదిగా ఉన్నాడు. మోడీ ఉండి అదేంటి వెంకయ్యాజీ... ఆ రెండు వాహనాలు రాకెట్లలా దూసుకుపోయాయి. మేం అదిరిపోయాం, నువ్వేమో ధైర్యంగా ఉన్నావేంటని అడిగాడు. ఇది మాకు అలవాటే, నెల్లూరులో ఆటోలు, టౌన్‌బస్సుల వేగానికి షార్ నుండి వదిలిన రాకెట్లు కూడా బలాదూర్ అని చెప్పాడు. మోడీ రోడ్డును పరిశీలిస్తూ వచ్చాడు. గాంధీబొమ్మ వద్దకు వచ్చాక... వెంకయ్యాజీ, ఇక్కడ ప్రతి అరకిలోమీటరుకు ఒక విగ్రహముందేంటని మోడీ అడిగాడు. ఇక్కడంతే మోడీజీ, మనుషులకంటే విగ్రహాలు ఎక్కువుగా ఉంటాయని చెప్పాడు. తర్వాత వెంకయ్య అక్కడే వున్న సీమా కేఫ్ వద్దకు మోడీని తీసుకెళ్లాడు. అక్కడ టీ తాగించాడు. అక్కడ టీ తాగుతుంటే మోడీకి చిన్నప్పుడు టీ అమ్మిన జ్ఞాపకాలు గుర్తుకొచ్చాయి. తర్వాత 'జైహింద్' స్వీట్‌స్టాల్‌కు తీసుకెళ్లి స్వీటు, హాటు తినిపించాడు. ఆ తర్వాత కోమల విలాస్‌లోకి వెళ్లారు. వెంకయ్య పది భోజనం టిక్కెట్లు ఇమ్మని అడిగాడు. అక్కడున్న పెద్దాయన... సాంబార్ లేదు, రసం లేదు, తాళింపు లేదు, చట్నీ లేదు... అని చెబుతుండగా, వెంకయ్య కోపంతో లేనివి కాదు, ఏం ఉన్నాయో చెప్పు అన్నాడు. వెంటనే అతను 'పప్పు' అన్నాడు. వెంకయ్య భోజనం టిక్కెట్లు తీసుకున్నాడు. అందరూ కడుపు నిండా తిన్నారు. తర్వాత క్రిందకొచ్చారు. అప్పటికే రాత్రి 11గంటలయ్యింది. ఏ.సి. సెంటర్‌దాకా నడుచుకుంటూ వెళ్లారు. ఆ సెంటర్‌లో నగర కాంగ్రెస్ కార్యాలయం ముందు ఓ కుర్చీలో ఓ వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతని కళ్లకు నల్లద్దాలు ఉన్నాయి. అంత రాత్రివేళ ఎక్కడికిపోవాలో దారి తెలియని వ్యక్తిలా వున్న అతడిని చూసి మోడీకి జాలేసింది. వెంకయ్య నేరుగా అతని వద్దకెళ్లి... ఏం వివేకా బాగున్నావా అని అడిగాడు. వెంకయ్య మాటను గుర్తుపట్టిన అతను కళ్లకున్న అద్దాలు తీయకుండానే టక్కున లేచి అక్కడే వున్న మోడీని కౌగిలించుకుని... వెంకన్నా, మీరా... ఎన్నిరోజులైంది మిమ్మల్ని చూసి... మంత్రయినందుకు కంగ్రాట్స్ అని చెప్పాడు. అప్పుడు మోడీకి అతని మీద జాలి, దయ లెవల్స్ పెరిగి, బాబు నేను వెంకయ్యను కాదు, ప్రధాని మోడీని, మనిషివి హాలీవుడ్ సినిమాలో సెకండ్ హీరోలా ఉన్నావు, కాని ఆ దేవుడు నీకు అన్యాయం చేసాడు. నువ్వేమీ దిగులుపడవద్దు... మా కళ్లను నీ కళ్లుగా చేసుకుని ఈ లోకాన్ని చూడు... అని అన్నాడు. అందుకు వివేకా... నాకు అన్యాయం చేసింది దేవుడు కాదు, దేవత అని చెప్పాడు. అదేంటి అని మోడీ ఆశ్చర్యంగా అడిగాడు. దానికి వివేకా... అవును సార్, మాకు అన్యాయం చేసింది మా కాంగ్రెస్ దేవత సోనియానే. ఆమె చేసిన విభజన పని వల్లే మేము ఓడిపోయి ఇక్కడ ఒంటరిగా కూర్చోవాల్సి వచ్చింది. లేకుంటే ఈ టైంలో నా చుట్టూ పదిమంది ఉండేవాళ్లు తెలుసా అని అన్నాడు. అందుకు మోడీ... నువ్వు అంధుడివి కావా... అని ప్రశ్నించాడు. వెంటనే వివేకా, నా కళ్లకున్న అద్దాలు చూసి మీరు అలా డిసైడయ్యారా... కర్ణుడికి కవచ కుండలాలు, నా కళ్లకు ఈ అద్దాలు ఎప్పుడూ కామన్ అని చెప్పాడు. వెంటనే వెంకయ్య అతనికి కళ్లు లేవనుకుంటే మనకు బుద్ధిలేనట్లే అని చెప్పి అక్కడనుండి తిరిగి షార్‌కు బయల్దేరారు.

కదంబం

# కవులేం జేస్తారు?

- డా॥ రాధేయ
అనంతపురం.
99851 71411

అసలు మనిషి స్వభావమే లేని వాడు – కవి అనే పదానికి ఎలా అర్హుడో తెలియదు. ఇవాళ కవి ఇతివృత్తంలో భాగం. దానికి ఆవల ఎక్కడో దూరంగా ఉండి బయటి మనిషిగా మాట్లాడలేదు. అతను కవిత్వంలో విడదీయరాని భాగం. సమాజంలో మార్పులో దేనిని నిలుపుకోవాలో, దేనిని నిరాకరించాలో నిర్ణయించే న్యాయమూర్తి!

**– ప్రొ॥ జయధీర్ తిరుమలరావు**

కవిత్వమంటే ఒక ఆత్మవిశ్వాసమే కవి నిరంతర పోరాట సంతకం. అశాంతిపై యుద్ధం ప్రకటించి శాంతి స్థాపనకు పూనుకున్న వాడు కవిగా మిగిలిపోతాడు. సృజనకారుని స్వప్నం సమసమాజస్వప్నమే. కవిత్వంలో ప్రకటించే సందర్భాలు, వైరుధ్యాలు, ఉద్యమాలు అన్నీ కూడా ఆయా కవుల భావజాలాల నుంచే మొలకెత్తుతాయి. ప్రతిభ, బలమైన ఆకాంక్ష, సాధన వుండాలేగానీ, వారి కవిత్వం నిత్య సౌందర్యవంతమై భాసిల్లుతుంది. జీవితాన్ని అన్ని పార్శ్వాలతో, అన్ని కోణాలతో విస్తరింపజేసే క్రమంలో కవి సఫలీకృతుడవుతాడు.

నేనో వాహకం. నా రక్తంలోంచి దూసుకొచ్చిన ప్రపంచమంతా కవిత్వమే. నా చూపుతో ముట్టుకున్నదీ నా చేత్తో ముట్టుకున్నదీ నా దేహంతో ముట్టుకున్నదీ కవిత్వమే నంటాడు కె.శివారెడ్డి. కవిత్వమే జీవితంగా జీవిస్తూ, జీవితమూ, కవిత్వమూ వేరుపడలేనంతగా తననుతాను కవిత్వానికి సమర్పించుకున్న కవి మాత్రమే యిలా రాయగలడు.

తన డెబ్బైరెండేళ్ళ జీవితంలో యాభైఏండ్లుగా కవిత్వం తనలో మమేకమైంది. కవుల నిజాయితీని ఏనాడూ శంకించలేదు వారు. కవులేం చెయ్యాలో, కవులేం చేస్తారో స్పష్టంగా ప్రకటించినవారు కె.శివారెడ్డి. వారి మాటల్లోనే చెప్పాలంటే –

*"కవులేం జేస్తారు । గోడలకు నోరిస్తారు । చెట్లకు కళ్ళిస్తారు*
*గాలికి గొంతిస్తారు । కవులేం జేస్తారు । ప్రభుత్వాన్ని ధిక్కరిస్తారు ।*
*ప్రజలకు చేతులిస్తారు । తెల్లకాయితానికి అనంతశక్తినిస్తారు ।*
*ప్రజలచేతుల్లో । అనంత శక్తిసంపన్నమైన పద్యాన్ని పెడతారు ।*
*కవులేం జేస్తారు । చట్టాన్ని ధిక్కరిస్తారు । ఎడారి మీద పద్యాలు*
*రాస్తారు । ఎడారి క్రమక్రమంగా । సజీవదేశంగా రూపొందుతుంది ।"*

**(కె.శివారెడ్డి – అజేయం – 1994)**

కవులేం జేస్తరు కవిత్వకు చదువుతరు కవిత్వకు రాస్తరు గుట్టల్ని కరిగించే మాటేమో గాని పాపాల పుట్టల్ని మాత్రం కదిలిస్తరు. కాగితాలకు కనుపాపల్ని అతికించి పాటల ఊటల చెలిమెల్ని తవ్వుతరు మదిలో ఉదయాల్ని మొలిపించి ధిక్కార స్వరాన్నిస్తరు అంటున్న ఈ మాటల్లోనే –

*"కవులేం జేస్తరు । ఆంక్షల ముళ్ల కంచెల్ని దాటి । అక్షర బీజాల్ని నాటి*
*ఆలోచనల్ని మొలిపిస్తరు । పాయల్ని కలుపుకొని । నదులై నడిపిస్తరు ।*
*పంజాదెబ్బ తిన్న లేడి । సలసలకరిగే నెత్తుర్ని । కలాల్లో నింపి, కరపత్రం*
*నిండా । అక్షరాల్ని నిక్షిప్తం జేస్తరు । పుట్టిన మట్టిపొరులో । నేలకొరిగిన*
*వీరులకు । గోడమీద ప్రాణం పోసి । మరణాన్నీ నిత్య నూతనం చేస్తరు ।"*

**(కొంతి మల్లారెడ్డి – అలికిడి – 2013)**

కవులేం జేశారు. తడియారని కాలం కన్నీటి చారికలను తమ చెక్కిలితో తడి చేశారు. మానవజాతి మానని ప్రణాలకు నవనీతపు గాజు గుడ్డలై చుట్టుకున్నారు. అంతేకాదు అతిశీతల మృత్యుమౌనానికి విస్ఫులింగాల్లాంటి మాటలనిచ్చారు. కన్నుగానని కారు చీకటిలో దీపధారులయ్యారు. పచ్చని పొలాలకు వెచ్చని పంట కాల్వలయ్యారు. సమాజపు అంధత్వానికి మువ్వలచేతి కర్రలయ్యారు అంటున్న కవి –

*"కవులేం జేశారు । వెలువెత్తిన పోరాటాలకు । పోటెత్తిన*
*పిడికిళ్ళనిచ్చారు । ఎగిసిపడే ఉద్యమ పెనుగాలులకు ।*
*తమకు తాము కరిగి । అక్షరాలను దీపాల్లా ముట్టించారు ।*
*అక్షరాల్ని । వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లల్ని*
*చేసారు । మాటల్ని మధుపాత్రల్లా పైకెత్తారు । పదాలను*
*మరఫిరంగుల్లా దట్టించారు । పాటలను యుద్ధ నౌకలను జేసి*
*లంగరెత్తారు ।"*

**– శిఖామణి**

ఇవీ కవుల కర్తవ్యాలు. కదనరంగ వాస్తవాలు. కల్లోలకాలంలో పోరాట విజయకేతనాలు. అక్షరాలు అందమైన ఆడపిల్లలే కాదు పోరాడే యుద్ధనౌకలు. అనంతశక్తివంతులుగా, ప్రజల పిడికిళ్ళుగా నిలబడతారని కవుల పక్షాన వాస్తవాలను వెల్లడించారు ఈ కవులు. కవి ఈ దేశానికి ప్రథమ పౌరుడే కాదు ఎప్పటికీ ప్రతిపక్షమేనని గుర్తించాలి.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువర్గంలో ముఖ్యులొకరికి ఆరోగ్యం బాగుండదు. పెట్టుబడి, షేర్ల రంగాల వారికి స్వల్ప ఆదాయం ఉంటుంది. ఉద్యోగులపై ఇతరుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. అదనపు బాధ్యతలుంటాయి. శుభకార్య ప్రయత్నాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపార రంగాలలో ఆదాయము పెరుగుతుంది. క్రొత్త వ్యాపార ప్రయత్నాలను ప్రస్తుతం విరమించుకొంటే మంచిది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ప్రభుత్వ పరంగా అనుమతులు ఆలస్యం కాగలవు. రాబడి ఖర్చులు సరిపోతుంటాయి. ప్రయాణాలలో జాగ్రత్త పడటం మంచిది. ఉద్యోగ నిర్వహణలో ఇబ్బందులు, అధికారుల వల్ల మాటలు పడటం జరుగవచ్చును. వర్కర్లు, అల్లులతో విభేదాలుంటాయి. వ్యాపార అవకాశాలు తగ్గుతాయి. అయినవారే సమస్యలను కలిపిస్తారు. ఉద్యోగప్రయత్నాలలో వెనుకబడతారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభవార్తలు వారాంతంలో వింటారు. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ప్రభుత్వ పరమైన పనులందు ఆటంకాలు, అనుమతులందు ఆలస్యం ఉంటుంది. వ్యాపారస్తులకు పోటీల వల్ల ఆర్థికస్థితి సామాన్యంగా ఉంటుంది. వృత్తినిర్వహణలకు ఆర్థికంగా కొంత మేలుగా ఉంటుంది. ఉద్యోగులకు పనిభారం పెరిగి, అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. అయితే ఇంటర్వ్యూలలో జాగ్రత్త అవసరం. వ్యాపార విస్తరణ ప్రయత్నాలలో అవకాశాలు స్వల్పంగా ఉంటాయి. ఆర్థికంగా ఇబ్బందులుంటాయి. ఖర్చులు పెరిగిపోతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయము సామాన్యము. వాయిదా పడ్డ పనులు ఒకటొకటే జరుగుతుంటాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరిగి శ్రమ పడతారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

### రాశి - మీ వాసి

తేది. 04.07.2014 నుండి
తేది. 10.07.2014 వరకు

ఈ వారం మేషంలో కేతువు, వృషభంలో శుక్రుడు, మిధునంలో రవిబుధులు, కర్కాటకంలో గురువు, కన్యలో కుజుడు, తులలో శనిరాహువులు, కన్యతుల వృశ్చికరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 8.7.14 మంగళవారం తొలిఏకాదశి పర్వదినము.
చాతుర్మాస్యవ్రతారంభము.
ముహూర్తములు లేవు.

**ఆషాఢ మాస శుక్లపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | శుక్ర | సప్తమి | రా॥గం.12.13వ॥ |
| తేది. 05 | శని | అష్టమి | రా॥గం.12.59వ॥ |
| తేది. 06 | ఆది | నవమి | రా॥గం.1.20వ॥ |
| తేది. 07 | సోమ | దశమి | రా॥గం.1.03వ॥ |
| తేది. 08 | మంగళ | ఏకాదశి | రా॥గం.12.22వ॥ |
| తేది. 09 | బుధ | ద్వాదశి | రా॥గం.11.10వ॥ |
| తేది. 10 | గురు | త్రయోదశి | రా॥గం.9.35వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆర్థికస్థితి ప్రోత్సాహకంగా ఉంటుంది. ఆదాయం పెరుగుతుంది. షేర్లు పెట్టుబడి రంగాలలో ఆదాయం తగ్గుతుంది. స్త్రీలకు ఆరోగ్యం సరిగా ఉండదు. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాల పనులు చేసేవారు జాగ్రత్తపడాలి. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. అధికారులవల్ల నిర్మాణ రంగాల వారికి పరిశ్రమల యజమానులకు సమస్యలు రాగలవు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

బంధుముఖ్యులొకరికి అనారోగ్య బాధ ఉంటుంది. పెట్టుబడి రంగాలలో లాభాలు తగ్గుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంక్ ఋణాలు లభ్యం కాగలవు. ఖర్చు లెక్కువుగా వుండినా ఆదాయానికి లోపం రాదు. వృత్తి వ్యాపారాలు అభివృద్ధికరంగా ఉంటాయి. మంచి ఆర్థికావకాశాలు దొరుకుతాయి. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతున్నా టెన్షన్ పడుతుంటారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులు క్రొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలలో కొద్ది పురోగతి మాత్రమే ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో పెట్టుబడి అవకాశాలు బాగుంటాయి. ఆర్థికస్థితి బాగుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్య నిర్ణయాలు జరిగి, దాని ప్రయత్నాలలో ఉంటారు. మీ ఆలోచనలు, పనులు మంచి ఫలితాన్ని అందిస్తాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అవకాశాలు తగులుతాయి. ఆర్థిక పరిస్థితి బాగుండి ఆదాయం బాగానే ఉంటుంది. అయితే పిల్లల వల్ల, శుభకార్యాల వల్ల ప్రయాణాల వల్ల ఖర్చులుంటాయి. వాణిజ్య ఒప్పందాలు, కాంట్రాక్టులందు కొంత జాగ్రత్త అవసరం. ఏ పనైనా ధైర్యంగా తెగించి చేసే మానసిక స్థితి ఉంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వాహనాలు, యంత్రాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాలి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత సరిగా ఉండదు. కుటుంబ సౌఖ్యముంటుంది. అనుకున్న పనులకు ఆటంకాలు ఏర్పడి చికాకు కలిగిస్తాయి. అదనపు ఖర్చులు పెరిగి, అవసరాలకు ఋణాలు, చేబదుళ్ళు తీసికొనక తప్పదు. వృత్తి వ్యాపారాలలోను, షేర్లు, పెట్టుబడులందు సామాన్య లాభాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వర్కర్ల చికాకులున్నా సర్దుబాటు జరుగుతుంది. వ్యాపారములలో పెట్టుబడి అవకాశాలు దొరకుతాయి. క్రయవిక్రయాలుంటే వాటిని నిర్ణయం చేస్తారు. ముఖ్య విషయాలలో నిర్ణయం తీసికొనలేని స్థితి ఉంది. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. అవసరాలకు డబ్బు సర్దుబాటు కావడం, ఋణాలు చేయడం జరుగుతుంది. ముఖ్యమైన చర్చలు బంధుమిత్రులతో ఉంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

షేర్లు పెట్టుబడి రంగాలలో స్వల్ప లాభాలుంటాయి. ఉద్యోగులు అటు అధికారులతో, ఇటు పబ్లిక్‌తో జాగ్రత్తగా ఉండండి. పనిభారం పెరిగి శ్రమ పడతారు. ఆర్థిక పరంగా పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. క్రొత్త అవకాశాలు దొరుకుతాయి. వృత్తి వ్యాపారాలలో ఇంట బయట వ్యవహారాలలో జాగ్రత్తగా వ్యవహరించండి. మీ మాటలను అపార్థాలుగా కొంతమంది మార్చి చెప్తారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

గృహంలో మార్పులు చేపడుతారు. రావలసిన బాకీలు శ్రమతో పొందుతారు. షేర్లు పెట్టుబడి రంగాలలో ఆదాయము పెరుగుతుంది. ఉద్యోగులకు అదనపు పని బాధ్యతలు పైనబడతాయి. దూరప్రయాణాలుంటాయి. వృత్తివ్యాపారాలలో అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఇతరులకు వారి పనులందు సహాయ పడతారు. శుభకార్యాలు నిర్ణయం చేయగలరు.

# రక్తపాత రాజకీయాలు వద్దు

## ఎమ్మెల్యేలకు టిఎన్‌ఎస్‌ఎఫ్ హితవు



హత్యారాజకీయాలు వద్దంటూ నాటకాన్ని ప్రదర్శిస్తున్న టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టిఎన్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో హింసా రాజకీయాలను వ్యతిరేకిస్తూ జూన్ 29న నెల్లూరు విఆర్‌సి సెంటర్ నుంచి గాంధీ బొమ్మ వరకు శాంతియుతంగా గులాబీ పూలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ప్రశాంత నెల్లూరును పులివెందుల లాంటి ఫ్యాక్షనిస్టు నగరంగా మార్చవద్దని, ఒక ప్రజాప్రతినిధి స్థాయిలో బెదిరించటం తగదని హితవు చెబుతూ వినూత్న నాటకాన్ని ప్రదర్శించారు.

ఈ సందర్భంగా టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు కాకర్ల తిరుమల నాయుడు మాట్లాడుతూ నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సమయంలో అభివృద్ధికి అనుకూలంగా చేతులు ఎత్తి మద్దతు తెలిపితే చేతులు నరికేస్తామని, చంపేస్తామని హత్యారాజకీయాలకు పాల్పడటం తగదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి హితవు పలికారు. నెల్లూరు నగరాభివృద్ధికి అందరూ కలసి రావాలని, ఫ్యాక్షనిస్టు రాజకీయాలను వదిలి సమిష్టి కృషితో నెల్లూరునగరాన్ని స్మార్ట్‌సిటీగా మార్చుకొందామని ప్రతిపక్ష నాయకులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్‌కె.అమ్రుల్లా, రూరల్ కార్యదర్శి మోను, నాయకులు వంశీకృష్ణ, ప్రేమ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రుణమాఫీపై...

# రైతుల రౌండ్‌టేబుల్ సమావేశం

నెల్లూరులోని దామవరపు చెన్నమ్మ భవన్‌లో జూన్ 30న వివిధ రైతు సంఘాల నేతలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రైతుసంఘం అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుణమాఫీని వెంటనే అమలు చేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వ్యవసాయ కాలం ప్రారంభం కావడంతో రైతులు అధిక వడ్డీలకు బయట అప్పు చేయాల్సి వస్తుందని, బ్యాంకులు కొత్తగా అప్పులు ఇవ్వకపోవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కోటిరెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సాగు కోసం రైతులు దుక్కి దున్నారని, రుణమాఫీ ఆలస్యమయితే విత్తనాలు చల్లక అదను దాటిపోతే రైతులు నష్టపోతారన్నారు. జిల్లా కార్యదర్శి బలిజేపల్లి మాట్లాడుతూ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే భవిష్యత్ కాలంలో తెలుగుదేశంపార్టీ గతంలో అనుభవాలు చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు వెంకటరమణారెడ్డి, గంగిరెడ్డి, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాలగురునాథం, గంగపట్నం రమణయ్య, మాజీ ఎంపిపి పొట్టేపాళెం చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

### మద్యం దుకాణాల నుంచి

# రూ.125.76 కోట్లు రాబడి

**- ఎక్సైజ్ ఇ.ఎస్ శ్రీనివాస్ వెల్లడి**

జిల్లాలోని 32 మద్యం దుకాణాల నుంచి రూ.125.76 కోట్లు రాబడి వచ్చిందని నెల్లూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ తెలియజేశారు. మంగళవారం నాడిక్కడ ఆయన తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, జిల్లాలోని నెల్లూరు, గూడూరు, ఎక్సైజ్ పరిధిలోని 348 మద్యం దుకాణాలకు, కొత్తగా 322 దుకాణాలకు ఇటీవల లక్కీ డ్రా నిర్వహించామని, మిగిలిన 26 దుకాణాలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైందని తెలిపారు. సూళ్ళూరుపేట సమీపంలోని మన్నారుపోలూరు మద్యం దుకాణానికి లైసెన్స్ పొందిన వ్యాపారి ఆ షాపు నిర్వహణకు ముందుకు రాలేదని, ఆ దుకాణంతో కలిపి 27 దుకాణాలకు దరఖాస్తులు కోరుతున్నామని ఆయన తెలిపారు.

ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 3 గంటల లోపు దరఖాస్తులు స్వీకరిస్తామని, 6 గంటలకు ఇ.ఎస్ కార్యాలయంలో లక్కీ డ్రా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి లైసెన్సీ కొత్త నిబంధనలకు కట్టుబడి వ్యవహరించాలని, లేనిపక్షంలో అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# పెట్రోధరల పెంపు అన్యాయం

**- సిపిఐ కార్యదర్శి, దామా అంకయ్య**

పెట్రోధరలను పెంచడం అన్యాయమని, పెంచిన పెట్రోలు, డీజల్ ధరలను వెంటనే తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కార్యదర్శి దామా అంకయ్య అన్నారు. పెరిగిన పెట్రో ధరలకు నిరసనగా మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద మోకాళ్ళపై నిలబడి వినూత్నంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమది సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకునే ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులు గడిచేలోపే సామాన్యుల నడ్డి విరిచేవిధంగా ధరలు పెంచడం దారుణమన్నారు. పెట్రోల్‌పై లీటరుకు రూ. 1.59, డీజల్‌పై 60 పైసలు పెంచడం వల్ల, దీని ప్రభావంతో నిత్యావసర ధరలు కూడా మరింత భగ్గుమంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలను వెంటనే ఉపసంహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్కే కరిముల్లా, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్ ప్రభాకర్, నగర సహాయ కార్యదర్శి ఎస్‌కె మునీర్‌లతో పాటు నాయకులు సిరాజ్, లీలామోహన్, నాగేంద్ర, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ వైభవం...!



నెల్లూరు నవాబుపేటలోని ఇండియన్‌బ్యాంక్ ఆఫీసర్ మేదర దిలీప్‌కుమార్ - దయామయిల కుమార్తె **శ్రావణదీపిక - కిషోర్‌కుమార్** ల కల్యాణం జూన్ 22న నెల్లూరు స్వర్ణవేదికలో వైభవంగా జరిగింది. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.

# నెల్లూరు మేయర్‌గా అజీజ్

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తొలుత కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఇద్దరు ఎమ్మెల్సీలు వాకాటి నారాయణరెడ్డి, వితపు బాలసుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు పి.అనిల్ కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. మొత్తం 54మంది కార్పొరేటర్లు ఈ ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకున్నారు. సభ్యుల ప్రమాణస్వీకార అనంతరం ఎన్నికల అధికారి కలెక్టర్ శ్రీకాంత్ సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నికను నిర్వహించారు.

## ఆద్యంతం ఉద్రిక్తతల మధ్య...

నెల్లూరు నగరపాలక సంస్థ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉదయం 11గంటలకు మొదలైంది. తెలుగు అక్షరక్రమంలో అందరిచేత కలెక్టర్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం ఎన్నికల ప్రక్రియను ప్రారంభిస్తూ అక్షర క్రమంలో తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థిగా జాగాబత్తిన శివప్రసాద్ పేరును చదువగా 7వడివిజన్ కార్పొరేటర్ కిన్నెరప్రసాద్ మద్దతు పలుకగా 21వ డివిజన్ కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్ బలపరిచారు. ఇక మద్దతుగా సభ్యులను చేతులు పైకెత్తమనే సమయంలో తెలుగుదేశం సభ్యులు రహస్య ఓటింగ్‌కు డిమాండ్ చేసారు. నగరంలో కార్పొరేటర్లకు రక్షణ లేకుండా పోయిందని, తమ పార్టీకి కాకుండా ఇతర పార్టీ అభ్యర్థికి చేతులెత్తితే ఆ చేతులు నరికేస్తామని వైకాపా ఎమ్మెల్యేలు బెదిరిస్తున్నారని, కాబట్టి రహస్య ఓటింగ్ నిర్వహించాలని పట్టుబట్టారు. అయితే ఎన్నికల నిబంధనల్లో ఇది లేదని, ఎన్నికల కమీషన్ ఇచ్చిన నిబంధనల ప్రకారమే ఎన్నిక జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేసారు. దీంతో తెలుగుదేశం సభ్యులు పోడియం ముందు బైఠాయించి తమ నిరసన తెలిపారు. ఒక దశలో తెలుగుదేశం కార్పొరేటర్లు ఉచ్చి భువనేశ్వరప్రసాద్, కిన్నెరప్రసాద్, నూనె మల్లిఖార్జునయాదవ్, దాసరి రాజేష్‌లకు వైకాపా కార్పొరేటర్లు రూప్‌కుమార్‌యాదవ్, బొబ్బల శ్రీనివాసకుమార్‌లకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది.

## మేకపాటి రాకతో ముదిరిన వివాదం...

సభలో ఆందోళనలు జరుగుతున్న సమయంలోనే నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశించి నేరుగా కలెక్టర్ కుర్చీ వద్దకు వెళ్లారు. మేకపాటిని చూడటంతోటే తెలుగుదేశం సభ్యులు తమ ఆందోళనను తీవ్రతరం చేసారు. కౌన్సిల్‌లో సభ్యత్వం లేని ఎంపీకి ఇక్కడ ఏం పనంటూ నిలదీసారు. దీంతో వైసిపి ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు ఆయనకు నచ్చజెప్పి బయటకు పంపించారు.

సాయంత్రం 4గంటల వరకు కూడా తెలుగుదేశం సభ్యులు ఆందోళన విరమించకపోవడంతో కలెక్టర్ ఎన్నికల సంఘంతో సంప్రదించి తదుపరి కార్యాచరణకు పూనుకున్నారు. దేశం సభ్యులు తమ



పోడియం వద్ద తెదేపా కార్పొరేటర్ల వాగ్వాదం

స్థానాలలో కూర్చోకపోవడంతో వైకాపా మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అజీజ్ పేరును ప్రకటించి ఎన్నిక ప్రక్రియను తిరిగి ప్రారంభించారు. అజీజ్‌కు మద్దతుగా ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలతో పాటు 32 మంది కార్పొరేటర్లు చేతులెత్తారు. అలాగే డిప్యూటీ మేయర్‌గా ఎం.ద్వారకానాథ్‌ను కూడా ఇదే మెజార్టీతో ఎన్నుకున్నారు.

ఈసారి మున్సిపల్ ఎన్నికలు పెద్ద ప్రహసనంగా జరిగాయి. న్యాయస్థానం ఆదేశాలతో ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కదిలింది. మార్చి 30వ తేదీన నెల్లూరు కార్పొరేషన్‌లోని 54 డివిజన్‌లకు ఎన్నికలు జరిగాయి. సార్వత్రిక ఎన్నికలకు ముందే వీటి ఫలితాలు వెల్లడై వుండాలి. కాని వీటి ఫలితాల ప్రభావం సార్వత్రిక ఎన్నికలపై పడుతుందని ఒక పార్టీ వాళ్లు కోర్టులో పిటిషన్ వేసారు. కోర్టు జోక్యం చేసుకుని కౌంటింగ్‌ను ఆపేసింది. సార్వత్రిక ఎన్నికల తర్వాతే మున్సిపల్ ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. దీంతో ఈ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఫలితాల కోసం నెలలతరబడి నిరీక్షించాల్సి వచ్చింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ముగిసాక మే 12వ తేదీన నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల కౌంటింగ్ జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి అత్యధికంగా 32డివిజన్‌లు దక్కగా, తెలుగుదేశంకు 17డివిజన్‌లు, బీజేపీకి రెండు, సీపీఎంకు 1, కాంగ్రెస్‌కు 1, ఇండిపెండెంట్ 1 విజయం సాధించారు. ఫలితాలతో వైకాపా పూర్తి మెజార్టీ సాధించినట్లయ్యింది. అయితే ఆ తర్వాత అసెంబ్లీ ఫలితాలు వెలువడడం, తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడడం, కొత్తగా ఎన్నికైన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆయా కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీలలో ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నమోదు కావాల్సి వుండడంతో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ఎంపిక కాస్తా ఆలస్యమైంది. అన్ని అవాంతరాలు ముగిసాక ఎట్టకేలకు 3వ తేదీన ఎన్నికలు నిర్వహించారు. మొత్తానికి మూడు నెలల సుదీర్ఘ ప్రక్రియ నడిచాక నెల్లూరు నగర పాలక సంస్థకు పూర్తి స్థాయి పాలకవర్గం ఏర్పడడం విశేషం.



మేయర్‌గా అజీజ్ సంతకం

# తనయుడు పార్టీకి

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం విస్మరించేది లేదంటున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తానున్నానంటూ కార్యకర్తలకు ఆయన భరోసా ఇస్తున్నారు. దీంతో, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఒక మంచి యువనేత ఆసరా దొరికినట్లయింది. ఒకవైపు తన తండ్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడున్న రాష్ట్ర పరిస్థితుల్లో నిత్యం బిజీగా వుండడం, విభజన తర్వాత రాష్ట్రంలో పెల్లుబుకుతున్న అనేకానేక సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తుండడంతో, లోకేష్ కూడా తండ్రి బాటలో పయనిస్తూ, పార్టీ కార్యకలాపాల్లో తండ్రికి చేదోడు వాదోడుగా వుంటున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా పార్టీ కార్యకర్తల సంక్షేమానికే ఆయన అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. హైదరాబాద్‌లో వుంటే రోజంతా పార్టీ కార్యాలయమైన ఎన్టీఆర్ భవన్‌లో వుండి, కార్యకర్తలు చెప్పే సమస్యలన్నిటినీ ఆయన ఓపిగ్గా వింటున్నారు. అందులో అవసరమైన వారికి తనవంతు చేయూతను కూడా అందిస్తుండడంతో పార్టీ కార్యకర్తల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దీంతో, యువనేత లోకేష్ కోసం నిత్యం వచ్చే కార్యకర్తల సంఖ్య గణనీయంగానే వుంటోంది.

తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమనిధికి సమన్వయకర్తగా కూడా వున్న లోకేష్, కార్యకర్తల సంక్షేమానికి ఇలా మంచి ప్రాధాన్యత ఇస్తుండడంతో, ఇటు ఆంధ్రప్రదేశ్ నుంచే కాక అటు తెలంగాణ నుంచి కూడా అనేకమంది కార్యకర్తలు ఆయన వద్దకు వచ్చి తమ సమస్యలను విన్నవించుకుంటున్నారు. వారు చెప్పినవన్నీ విన్న తర్వాత, వాటిలో నిజానిజాలను పరిశీలించి, అవసరమైన కార్యకర్తలకు, వారి కుటుంబాలకు తనవంతు సాయం అందిస్తుండడంతో లోకేష్ పట్ల కార్యకర్తలకు మరింత అభిమానం, ఆత్మీయత ఏర్పడుతున్నాయి. కార్యకర్తలు తమ పిల్లల చదువుల కోసం తపన పడుతుండడం, పెద్దమొత్తాలో వున్న ఆ ఫీజులు కట్టలేక అవస్తలు పడుతుండడం..ఇలాంటి సమస్యలు ఆయన దృష్టికి వచ్చినప్పుడు లోకేష్ బాగా స్పందిస్తున్నారు. వారికి తనవంతు సాయంగా కొంత నగదును కూడా ఇస్తున్నారు. దీంతో కార్యకర్తలు మరింత సంబరపడిపోతున్నారు. తమ సమస్యలు విని సాయమందించే నేత లభించారన్న ఆనందం వారిలో కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలనా వ్యవహారాల్లో తలమునకలై వుండడంతో, ఇటు పార్టీపరంగా కార్యకర్తలకు ఎలాంటి లోటు లేకుండా చూడాలని లోకేష్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అన్ని ప్రాంతాల వారి సమస్యలను సహనంతో వింటూ, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుండడంతో పాటు, పార్టీని బలోపేతం చేసుకునేందుకు లోకేష్ అన్నివర్గాల వారితో కలసిమెలసి వుండడం అటు కార్యకర్తలకే కాక, ఇటు నాయకులకు సైతం సంతోషం కలిగిస్తోంది. పార్టీకి పూర్తి సమయం కేటాయించి కార్యకర్తలతో అనునిత్యం కలుస్తూ, పార్టీలో పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించేందుకు కూడా ఆయన సమాయత్తమవుతున్నట్లు సమాచారం.

ఏదేమైనప్పటికీ, యువనేత లోకేష్ అందరిలా కాక, విభిన్నమైన ఆలోచనలతో పార్టీలోని కార్యకర్తల శ్రేయస్సు, సంక్షేమం కోసం కృషి చేస్తుండడం పార్టీలో కార్యకర్తలకే కాక, నాయకులకు..పార్టీలోని వారందరికీ ఆనందం కలిగిస్తోంది.






అభినందనలు

మాకు అత్యంత ఆప్తులు
శ్రీమతి పొనకా దేవసేన గారు
గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా
ఎన్నికైన శుభసందర్భంగా
మరియు వైస్‌ఛైర్మెన్‌గా ఎన్నికైన
శీలం కిరణ్‌కుమార్ గారికి
హృదయపూర్వక అభినందనలు
తెలియజేస్తూ...

గూడూరును అన్ని రంగాల్లో
అభివృద్ధిపథంలో నడపాలని కోరుకుంటూ...

మీ...
మనుబోలు హరిప్రసాద్‌రెడ్డి
గూడూరు పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు


**కావలి:** కావలి మున్సిపాల్టీని అనూహ్యంగా తెలుగుదేశం పార్టీ చేజిక్కించుకుంది. వైకాపా కౌన్సిలర్‌గా గెలిచిన అలేఖ్యను తెలుగుదేశం ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించారు. మరో కౌన్సిలర్ కూడా తెలుగుదేశంలో చేరారు. దీంతో 13-12 తేడాతో తెలుగుదేశం మున్సిపాల్టీని దక్కించుకుంది. ఛైర్మెన్‌గా అలేఖ్య, వైస్ ఛైర్మెన్‌గా గుండ్లపల్లి భరత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

**వెంకటగిరి:** మంచి మెజార్టీతో ఈ మున్సిపాల్టీ తెలుగుదేశం ఖాతాలో చేరింది. మొత్తం 25వార్డులకు గాను తెలుగుదేశంకు 21వార్డులున్నాయి. దీంతో ఎటువంటి ఇతరుల మద్దతు లేకుండానే తెలుగుదేశం దీనిని వశం చేసుకుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా గొంతు శారద, వైస్‌ఛైర్మెన్‌గా బీరం రాజేశ్వరరావులను ఎన్నుకున్నారు.

**గూడూరు:** ఉత్కంఠ పరిస్థితుల నడుమ గూడూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా టీడీపీ అభ్యర్థిని పొనకా దేవసేన లాటరీ విధానం ద్వారా ఎన్నికయ్యారు. వైస్‌ఛైర్మెన్‌గా శీలం కిరణ్ కుమార్‌ను టీడీపీ కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. టీడీపీకి ఇండిపెండెంట్ కౌన్సిలర్‌తో సహా 17మంది మద్దతు తెలుపగా, వైకాపాకు 16 మంది కౌన్సిర్లున్నా 31వవార్డు కౌన్సిలర్ ఎవరికీ మద్దతు తెలపకపోవడంతో 15మంది కౌన్సిలర్లతో సహా ఎమ్మెల్యే, ఎంపీ ఓటుతో 17మంది మద్దతు తెలుపడంతో హంగ్ ఏర్పడింది. దీంతో లాటరీ విధానం ద్వారా ఛైర్‌పర్సన్‌ను ఎన్నుకున్నారు.

**ఆత్మకూరు:** మేకపాటి కుటుంబానికి ప్రతిష్టాత్మకమైన ఆత్మకూరు మున్సిపాల్టీని కాంగ్రెస్ గెలుచుకుంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ గెలుచుకున్న ఏకైక మున్సిపాల్టీ ఇదే! తెలుగుదేశంతో పొత్తు కుదుర్చుకుని కాంగ్రెస్ ఇక్కడ గెలిచింది. ఒకే ఒక ఓటు తేడాతో ఇక్కడ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా కాంగ్రెస్ కౌన్సిలర్ రాగి వనమ్మ ఎన్నిక కాగా, వైస్‌ఛైర్మెన్‌గా సంధాని బాషా ఎన్నికయ్యారు.

**సూళ్లూరు పేట:** కాంగ్రెస్ సహకారంతో ఈ మున్సిపాల్టీని తెలుగుదేశం సొంతం చేసుకుంది. ఛైర్‌పర్సన్‌గా మాలేపాటి విజయలక్ష్మి, వైస్‌ఛైర్మెన్‌గా గరికపాటి ఈశ్వరమ్మలను ఒకే ఒక్క ఓటు తేడాతో ఎన్నుకున్నారు.

**నాయుడు పేట:** నాయుడుపేట నగర పంచాయితీని తెలుగుదేశం దక్కించుకుంది. మొత్తం 20వార్డులకు గాను తెలుగుదేశంకు 14వార్డులున్నాయి. దీంతో ఎన్నిక సులభమైంది. ఛైర్‌పర్సన్‌గా శోభారాణి, వైస్‌ఛైర్మెన్‌గా అత్తికాయల సుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## గురుకుల పాఠశాలకు
## లయన్స్‌క్లబ్ సీలింగ్‌ఫ్యాన్లు


ఫ్యాన్లు బహూకరిస్తున్న ఎస్‌ఐ బాబి, లయన్స్‌క్లబ్ సభ్యులు

విద్యార్థులు చదువుకుంటేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరని ఒకటవ పట్టణ ఎస్‌ఐ బాబి పేర్కొన్నారు. మినీ గురుకుల పాఠశాలలో గత నెల 29న లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాత శ్రీనివాస ఎంటర్‌ప్రైజస్ ప్రొప్రైటర్ యార్రం శ్రీనివాసులు సహకారంతో సీలింగ్ ఫ్యాన్లను పాఠశాలకు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రధానంగా గిరిజన బాలికల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యాబోధన సేవా దృక్పథంతో చేపట్టడం ద్వారా ఉత్తమ పౌరులు తయారవుతారన్నారు. మినీ గురుకులంలో విద్యతో పాటు భోజనం, దుస్తులు, వసతి కల్పిస్తారన్నారు. గిరిజన బాలికలు ఎక్కడ కనిపించినా పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ప్రణాళికా బద్ధంగా సొంత నిధులతో, దాతల సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఫాస్ట్ రీజియన్ ఛైర్మెన్ షేక్ రియాజ్ అహ్మద్, జోన్ ఛైర్మెన్ మల్లు విజయకుమార్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ కడివేటి చంద్రశేఖర్, యార్రం శ్రీనివాసులు, ఎం.వి.రమణయ్య, గూడూరు రాజేశ్వరరెడ్డి, కోట సురేష్, వాకాటి రామ్మోహన్, లీలామోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరివీధిలో సమస్యల తిష్ఠ

గూడూరు పట్టణంలోని కుమ్మరవీధిలో సమస్యలు తిష్ఠవేశాయి. ఆ వీధిలో 200కుపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ వీధిలో ఇళ్ల ముందు ఏర్పాటు చేసిన మురుగు కాలువలను ఆక్రమించి ర్యాంపులను రోడ్ల మీదకు నిర్మించడంతో రహదారులు ఇరుకైపోయాయి. దీంతో వాహనం రోడ్డుపై నిలిపితే అటుగా రాకపోకలు సాగించాలంటే వాహనచోదకులు, పాదచారులు అవస్థలు పడక తప్పడం లేదు. మురుగు కాలువలు అధ్వాన్నంగా ఉన్నాయి. దోమల నియంత్రణకు పురపాలక సంఘ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## తాళమ్మకు ప్రత్యేకపూజలు

గూడూరు పట్టణం విజయనగర్ కాలనీలోని గ్రామదేవత తాళమ్మ ఆలయంలో గత నెల29న విశేషపూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు.

## రోటరీక్లబ్ నూతన కార్యవర్గం


సభలో మాట్లాడుతున్న అసిస్టెంట్ గవర్నర్ శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు పశ్చిమ రోటరీక్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొమ్మిడి శ్రీనివాసులు, కార్యదర్శిగా వై.రామకృష్ణారెడ్డి, ట్రెజరర్‌గా దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి.జానకిరామిరెడ్డి హాజరయ్యారు. క్లబ్ పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు విద్యాసాగర్‌రావు, వాసుగౌడ్‌తో పాటు అసిస్టెంట్ గవర్నర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ముని గిరీష్, ఎన్.ఎస్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఐసిఇయు నూతన కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ జనరల్ సెక్రటరీ ఆర్.నగేష్

ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ గూడూరు బ్రాంచ్ యూనిట్ 32వ సర్వసభ్య సమావేశం గూడూరు ఎల్ఐసి బ్రాంచ్ ఆఫీసులో గత నెల26వ తేదీన జరిగింది.

ఈ కార్యక్రమానికి నెల్లూరు డివిజన్ జనరల్ సెక్రటరీ ఆర్.నగేష్ హాజరయ్యారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడుగా ఓ.ఆదినారాయణ, కార్యదర్శిగా ఎన్.శివకుమార్, కోశాధికారిగా వి.రామ్మోహన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## ప్రజా సేవకే రాజకీయాల్లోకి వచ్చా


సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న పార్లమెంటు సభ్యుడు వరప్రసాద్

ప్రజలకు సేవ చేయడానికే ప్రజలు నన్ను ఎన్నుకున్నారని పార్లమెంటు సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. ఆయన శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఎం.పి. వరప్రసాద్ మున్సిపల్ కార్యాలయానికి విచ్చేశారు. ఆయనకు శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ శ్రీలక్ష్మి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డు ఐ.ఎ.ఎస్ అధికారిగా ప్రజల సమస్యలను అర్థం చేసుకుని ఇంకా నిధులను తీసుకొచ్చి శ్రీకాళహస్తి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మనందరం ఒక కుటుంబ సభ్యులు మాత్రమేనని మీ సమస్యలు ఏమి ఉన్నా నా దృష్టికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి దృష్టికి తీసుకొస్తే ఎలాంటి సమస్య అయినా పరిష్కరించడానికి మా వంతు కృషి చేస్తామన్నారు. అభివృద్ధి మాటల్లో కాదని, కార్యాచరణరూపంలో దశలవారీగా చూపుతామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. వైకాపా నాయకులు అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. మున్సిపాలిటీలో పింఛన్లను వార్డు కౌన్సిలర్లకు అందిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బాలకృష్ణయ్య, వయ్యాల కృష్ణారెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎం.పి. శ్రీకాళహస్తి ఏరియా వంద పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించారు. డాక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎం.పి. మాట్లాడుతూ ఆసుపత్రిలో ఏమేమి సౌకర్యాలు కావాలి, సిబ్బంది కొరత ఉన్నారా ? లేరా అని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఉంటే తనకు వివరాలు ఇవ్వాలన్నారు. లేని సందర్భంలో ప్రభుత్వానికి నివేదికలు పంపించి తనకు తెలిపితే, లేదా ఆంధ్రప్రదేశ్ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి తెలిపితే వెంటనే స్పందిస్తామన్నారు. వైకాపా నాయకులు అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ సిబ్బంది కొరత ఎక్కువగా ఉందన్నారు. ఎం.పి. ఒక రిటైర్డు ఐ.ఎ.ఎస్ అధికారి కావడం మన అదృష్టంగా భావించాలన్నారు. ఒక పోస్టుమార్టం రూము లేదన్నారు. గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు సరైన వైద్యం అందించాలన్నారు.



## ముక్కంటి సన్నిధిలో..
## ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్

దక్షిణకాశిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీకాళహస్తీశ్వరస్వామి సన్నిధికి ఆయన కుటుంబ సమేతంగా విచ్చేశారు. సుపథ మండపం వద్ద ఆలయాధికారులు ఆయనకు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో ఆయన పలు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం గురు దక్షిణామూర్తి వద్ద స్వామి, అమ్మవార్ల చిత్రపటాలు, తీర్థప్రసాదాలను పి.ఆర్.ఓ. హరిబాబు, ఆలయ వేదపండితులు ఆశీర్వచనం చేసి ఆయనకు అందచేశారు. పిఎస్ఎల్‌వి-సి23 రాకెట్ విజయవంతం అయిన సందర్భంగా ఇస్రో ఛైర్మెన్ రాధాకృష్ణన్ శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని ఎంతో భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు


పోటీలో పాల్గొన్న విద్యార్థులు

అలఘనాథస్వామి ఆలయంలో ఇస్కాన్‌సిటీ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు జగన్నాథ రథయాత్ర ప్రాముఖ్యంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జగన్నాథ రథయాత్ర నిర్వాహకులు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ జూలై 12వ తేదీన గూడూరులో జగన్నాథరథయాత్ర జరుగుతుందన్నారు. ఒరిస్సాలోని పూరీలో జగన్నాథ రథయాత్ర సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ స్థానాలను ఎంపికచేసి జూలై 12న డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించే కార్యక్రమంలో బహుమతి ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే 400మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ భానుప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## నవ్వు 'కొనే'రోజులొచ్చాయి



మురళీ ఆర్ట్స్, జోకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో టి.వి.నటులు శింగంశెట్టి మురళీ మోహన్‌రావు నిర్వహణలో బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో జులై1న 'ఇంటర్నేషనల్ జోక్స్‌డే' ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంచిపెట్టారు.

శింగంశెట్టి మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ సృష్టిలోని జీవరాశులలో 'నవ్వు'కునే శక్తి ఒక్క మానవుడికే వుందని, నవ్వు దేవుడిచ్చిన వరమని, రోజుకో అరగంట మనస్ఫూర్తిగా నవ్వుకుంటే డాక్టర్ దగ్గరకెళ్లవలసిన అవసరం వుండదని, కాని బిజీలైఫ్‌లో నవ్వుకొనే అవకాశం లేకుండా పోతుందని, 'నవ్వు'కునే రోజులు పోయి 'నవ్వు'కొనే రోజులొచ్చాయని అంటూ ఈ 'జోక్స్‌డే'ని వృద్ధుల మధ్య జరుపుకుని వారిని నవ్వించే అదృష్టం కలిగిందని అన్నారు. మురళీఆర్ట్స్ జోకింగ్ క్లబ్ స్థాపించి 5సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా క్లబ్ సభ్యులు బి.వి.నరసింహం, మల్లు రామయ్య, దొరబాబు, అచ్యుతమణి, నాగేశ్వరరావు, అమానుల్లాఖాన్, సుధాకర్ తదితర సభ్యులు క్లబ్ వ్యవస్థాపకుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ అధికారి నాగేశ్వరరావు, గీతామయి వృద్ధుల ఆశ్రమం నిర్వాహకులు తమ్మినేని పాండు, సునీత, క్లబ్ సభ్యులు 'జోక్స్' చెప్పి అలరించారు.

- సత్తా చాటిన భారత్
- నింగిలోకి దూసుకెళ్ళిన పిఎస్ఎల్వి-సి23
- ప్రధాని రాకతో షార్‌లో సందడి








# మరో అద్భుత విజయం



**అంతరిక్ష ప్రయోగాల్లో భారత కీర్తిపతాక మరోసారి రెపరెపలాడింది. అంతరిక్ష విజ్ఞానంలో భారత శాస్త్రవేత్తలు మరోసారి తమ సత్తాను నిరూపించుకున్నారు.**

సోమవారం ఉదయం 9 గంటలా 52 నిమిసాలకు షార్ కేంద్రం నుంచి పిఎస్ఎల్వి సి-23 (పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకుపోయింది. విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. దేశ ప్రధాని నరేంద్రమోడితో పాటు ప్రయోగాన్ని వీక్షిస్తున్నవారంతా కరతాళ ధ్వనులు చేస్తుండగా పిఎస్ఎల్వి డి-23 రాకెట్ విజయ పథంలోకి దూసుకుపోయింది. టీవీల్లో ఈ ప్రయోగాన్ని వీక్షిస్తున్న ప్రజలు ఈ అద్భుత విజయాన్ని చూసి ఒక్కసారిగా ఆనందంతో కేరింతలు కొట్టారు. షార్‌లో శాస్త్రవేత్తలు, అధికారులు, స్థానికులు అందరూ సంతోషభరితులయ్యారు. దీంతో, షార్ కేంద్రం నుంచి అంతరిక్షంలో మరో అద్భుత విజయం ఆవిష్కరించినట్లయింది. అంతరిక్ష రంగంలో భారత్ సగర్వంగా విజయకేతనం ఎగురవేసినట్లయింది. ఇస్రో తొలిసారిగా 1993 సెప్టెంబర్ 20వ తేదీన ప్రయోగించిన పిఎస్ఎల్వి డి-1 రాకెట్ ప్రయోగం విఫలం కావడంతో శాస్త్రవేత్తలు అప్పట్లో కొంత నిరాశకు గురైనా, అపజయం నుంచే పాఠాలు నేర్చుకున్నారు. విజయానికి బాటలు వేసుకున్నారు. మళ్ళీ రెట్టింపు కృషి చేసి 1994 అక్టోబరు 15వ తేదిన పిఎస్ఎల్వి డి-2ని మన శాస్త్రవేత్తలు అత్యద్భుతంగా ప్రయోగించి విజయం సాధించారు. అప్పటి నుంచి షార్ శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనల్లో మరింత రాటు దేలుతూ, నేటికీ విజయ పరంపరను సాధిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతూనే వున్నారు. అందులోనూ ప్రత్యేకించి పిఎస్ఎల్వి సీరీస్‌లో రాకెట్ల ప్రయోగంలో తిరుగులేని ప్రతిభను చాటుతూ ప్రపంచఖ్యాతిని పొందుతున్నారు. 1994 నుంచి నేటి దాకా పిఎస్ఎల్వి సీరీస్‌లో 26 రాకెట్లు విజయవంతంగా ప్రయోగించిన ఘనత మన శాస్త్రవేత్తలది కావడం అందరికీ గర్వకారణం. ఈ మొత్తం 26 రాకెట్ల ద్వారా 70 ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టి శాస్త్ర సాంకేతికరంగాల్లో, అంతరిక్ష పరిజ్ఞానంలో తమ ప్రతిభా పాటవాలను నిరూపించుకున్నారు. ఇప్పటివరకు షార్ నుంచి అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టినవి 30 స్వదేశీ ఉపగ్రహాలు కాగా, ఇతర దేశాల సౌలభ్యం కోసం 40 ఉపగ్రహాలు ప్రవేశపెట్టారు. సోమవారం ప్రయోగించిన పిఎస్ఎల్వి సి-23 రాకెట్ ద్వారా 5 విదేశీ ఉపగ్రహాలను కేవలం 20 నిమిషాల వ్యవధిలోనే అంతరిక్ష కక్ష్యలో ప్రవేశపెట్టి తమ సత్తాను మరోసారి చాటుకున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన 714 కిలోల బరువున్న స్పాట్-7 ఉపగ్రహాన్ని, అదేవిధంగా జర్మనీకి చెందిన 14 కిలోల బరువున్న ఎఐ శాట్ ఉపగ్రహాన్ని, కెనడాకు చెందిన 15 కిలోల బరువున్న ఎన్ఎల్ఎస్ ఉపగ్రహాన్ని, సింగపూర్‌కు చెందిన 7 కిలోల బరువున్న వెలాక్స్-1 ఉపగ్రహాన్ని దిగ్విజయంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టడంతో షార్‌లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. ఇదిలావుంటే, భారతదేశ ప్రజల ఆశాజ్యోతి అయిన నరేంద్రమోడీ భారత దేశ ప్రధానిగా పదవిని అధిష్టించిన తర్వాత, షార్ నుంచి తొలిసారిగా జరిగిన ఈ అద్భుత ప్రయోగాన్ని ఆయన స్వయంగా వీక్షించేందుకు విచ్చేయడం మరో విశేషం. ప్రధాని రాకతో షార్‌లో మరింత సందడి నెలకొంది. ఈ రాకెట్ ప్రయోగ విజయంతో ప్రధాని పులకించిపోయారు. కరతాళధ్వనులతో ఆయన శాస్త్రవేత్తలను పదే పదే అభినందించి వారికి మరింత ఉత్సాహాన్నిచ్చారు. శాస్త్రవేత్తల వద్దకు ప్రధానే నేరుగా వెళ్ళి వారి భుజం తట్టి ప్రోత్సహించడంతో శాస్త్రవేత్తల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇస్రో ఛైర్మెన్ డాక్టర్ కె. రాధాకృష్ణన్, షార్ డైరెక్టర్ డాక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, మిషన్ డైరెక్టర్ కున్హికృష్ణన్ తదితర ముఖ్యులందరినీ ప్రధాని అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్రమోడీతో పాటు, రాష్ట్ర గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రులు వెంకయ్యనాయుడు, జితేంద్రసింగ్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, శాసనమండలి ఛైర్మెన్ చక్రపాణి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కృష్ణారావు, డిజిపి రాములు, గుంటూరు ఐజి సునీల్‌కుమార్‌లతో పాటు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ నవదీప్‌సింగ్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావు తదితరులు పాల్గొని షార్ శాస్త్రవేత్తలను, అధికారులను అభినందించారు. అటు రాకెట్ ప్రయోగం, ఇటు ప్రధాని నరేంద్రమోడీ పర్యటనల సందర్భంగా షార్ కేంద్రం చుట్టూ వేలాదిమంది పోలీసులు, కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహించారు. రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో దేశ ప్రజలందరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. శాస్త్రవేత్తలందరికీ అభినందనలు తెలియజేస్తున్నారు.










# శ్రీసిటీకి ప్రతిష్ఠాత్మక అవార్డు



అవార్డునందుకుంటున్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవి సన్నారెడ్డి

దక్షిణ భారత దేశంలో అత్యుత్తమ బహుళ ఉత్పత్తుల సెజ్ పురస్కారం శ్రీసిటీ సాధించింది. ఇది ఎంతో ప్రతిష్టాత్మకమైన పురస్కారం కూడా. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ బిజినెస్ సిటీగా వున్న శ్రీసిటీకి ఈ 'బెస్ట్ మల్టీ ప్రాడెక్ట్ స్పెషల్ ఎకనమిక్ జోన్ ఇన్ సౌత్ఇండియా' అవార్డు రావడం ఎంతో గర్వకారణం. ఎగ్జిమ్ ఇండియా ఇటీవల చెన్నైలో ఏర్పాటుచేసిన సౌత్ ఈస్ట్ సిఇఓ కాన్‌క్లేవ్ అవార్డ్స్-2014 కార్యక్రమంలో శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును అందుకున్నారు. ఎంసిసిఐ ఎక్స్‌పర్ట్స్ కమిటీ ఛైర్మెన్ జె.శ్రీకృష్ణన్, ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ ఛైర్మెన్ రమేష్ ఎన్ రామకృష్ణన్ చేతుల మీదుగా ఈ అవార్డుతో పాటు, ప్రశంసాపత్రాన్ని కూడా ఆయన అందుకున్నారు. శ్రీసిటీ సెజ్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం తనకెంతో ఆనందంగా వుందని, మరింత ఉన్నతప్రమాణాలతో, నిబద్ధతతో సెజ్‌ను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తాము కృషి చేస్తామని ఈ సందర్భంగా శ్రీసిటీ ఎం.డి రవీంద్రసన్నారెడ్డి అన్నారు.




Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.